

మురుగునీటి పారుదలకు తగిన

**చర్యలు తీసుకోండి**

2లో

నేటి దినపత్రిక

సూర్య

18వ వసంతంలోకి

శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు


ఆదివారం | 02 మార్చి 2025 | పేజీలు 8



## గిరిజన కాలనీల్లో.. మెడికల్ క్యాంపులు

# నిర్వహించండి

- సేవకు మారుపేరు సింహపురి వైద్య సేవా సమితి
- ఆరోగ్యం విషయంలో నిర్లక్ష్యం వీడండి
- ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి





**నెల్లూరు, మేజర్‌న్యూస్ :**

కొడవలూరు మండలం రాజుపాళెం గ్రామంలో సింహపురి వైద్య సేవా సమితి ఆధ్వర్యంలో జయభారత్ హాస్పిటల్ నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాన్ని ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి మాట్లాడుతూ.. ఆరోగ్య సమస్యలు తలెత్తినప్పుడు నిర్లక్ష్యం చేయకుండా వైద్యులను సంప్రదించాలని కోరారు. సమాజంలో మారుతున్న జీవనశైలి, ఆహారపు అలవాట్లు, ఒత్తిడి వల్ల వచ్చే అనారోగ్య సమస్యల పట్ల అప్రమత్తంగా ఉండాలని కోరారు. సింహపురి వైద్య సేవా సమితి ఆధ్వర్యంలో జయ భారత్ హాస్పిటల్ అందిస్తున్న వైద్య సేవలను ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి కొనియాడారు. మెడికల్ క్యాంప్ ద్వారా కిడ్నీ, కళ్ళు, కీళ్ళు, ఎముకల వ్యాధులకు ఉచితంగా వైద్యం సేవలు అందిస్తున్న జయభారత్ వైద్య సిబ్బందిని ఆమె అభినందించారు. మారు మూల ఎస్సీ, ఎస్టీ కాలనీలకు జయభారత్ వైద్య సేవలు విస్తరిం చాలని ఆమె ఆకాంక్షించారు. అవసరమైతే టీడీపీ స్థానిక నాయకుల సేవలు వినియోగించుకోవాలని సింహపురి వైద్య సేవా సమితి పెద్దలకు సూచించారు. వీపీఆర్ ఫౌండేషన్ ద్వారా నిర్వ హించిన ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో స్థానిక నాయకుల కీలకమన్నారు. అనంతరం ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి తనయులు డాక్టర్ అర్జున్ రెడ్డి మాట్లాడుతూ.. చికిత్స కన్నా వ్యాధి నిర్ధారణ ముఖ్యమన్నారు. అనారోగ్య సమస్యలు ఎదురైనప్పుడు నిర్లక్ష్యం చేయకుండా డాక్టర్‌ను సంప్రదించాలని, ఆరోగ్య విషయంలో నిర్లక్ష్యం తగదన్నారు. కార్యక్రమంలో సింహపురి వైద్య సేవా సమితి ట్రస్టీ డాక్టర్ ఏవీ సుబ్రహ్మణ్యం, జీవీ కృష్ణారెడ్డి, హరికుమార్ రెడ్డి, టీడీపీ నాయకులు బెజవాడ వంశీకృష్ణా రెడ్డి, ముంగమూరు చైతన్యరెడ్డి, జయభారత్ వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

### రాష్ట్రంలో ప్రతినెలా 1న

# పింఛన్ల పండుగ

- 68 లక్షల మంది లబ్ధిదారులకు ఒకటో తేదీనే పింఛన్లు
- ఎస్సీ, ఎస్టీ బీసీలకు బడ్జెట్‌లో పెద్దపీట
- ఈ ఏడాదిలోనే తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ
- మున్సిపాలిటీల ఆదాయాన్ని ఖర్చు చేసుకునే స్వేచ్ఛ మున్సిపాలిటీలకే
- రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధిశాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ




**నెల్లూరు కలెక్టరేట్, మేజర్‌న్యూస్ :**

ప్రతినెలా ఒకటో తేదీన రాష్ట్రంలో పింఛన్ల పండుగ రోజు అని రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ అన్నారు. శనివారం ఉదయం నెల్లూరు నగరంలోని 54వ డివిజన్ భగత్‌సింగ్ కాలనీలో ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. లబ్ధిదారుల ఇంటి వద్దకు వెళ్లి పింఛన్లు అందించి వారి యోగక్షేమాలు తెలుసుకున్నారు. ప్రజలతో మమేకమవుతూ వారు తెలిపిన పలు సమస్యలకు వెంటనే పరిష్కారం చూపించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. రాష్ట్రవ్యాప్తంగా ప్రతినెల ఒకటో తారీఖున రాష్ట్రంలో పింఛన్ల పంపిణీ పండుగ రోజుగా చెప్పారు. ముఖ్యమంత్రి చంద్రబాబు

-మిగతా 2లో

### అల్లిపురం డంపింగ్ యార్డ్‌లో చెత్త తొలగింపుకు

## శంకుస్థాపన



శంకుస్థాపన చేస్తున్న మంత్రి పొంగూరు నారాయణ, ఎమ్మెల్యే సోమిరెడ్డి తదితరులు

# నగరాలు, పట్టణాల అభివృద్ధికి కృషి చేయాలి

- జిల్లా కలెక్టర్ ఆనంద్
- ప్రజలకు అందుబాటు ధరలలో ఇంటి స్థలాలు
- నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి



**నెల్లూరు టౌన్, మేజర్‌న్యూస్ :**

నెల్లూరు అర్బన్ డెవలప్‌మెంటు అథారిటీ (నుడా) ఆధ్వర్యంలో నెల్లూరు నగరంతో పాటు పట్టణాల అభివృద్ధికి కృషి చేయాలని జిల్లా కలెక్టర్ ఆనంద్ నుడా కమిటీ సభ్యులు, అధికారులకు సూచించారు. శనివారం నెల్లూరు నగరంలోని వేదాయపాలెం గాంధీనగర్‌లో గల నుడా కార్యాలయంలో నుడా అథారిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి జిల్లా కలెక్టర్ ఆనంద్, నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, నుడా వైస్ చైర్మన్ సూర్యతేజ, నుడా అథారిటీ సభ్యులు హాజరైయ్యారు. తొలుత 21 అజెండా అంశాలను కమిటీ ఆమోదం కోసం నుడా జూనియర్ అకౌంట్ ఆఫీసర్ సురేష్ చదివి వినిపించారు. నుడా కార్యకలాపాల కోసం సిబ్బంది నియామకం, లేఅవుట్ల అభివృద్ధి, బడ్జెట్ కేటాయింపులు అజెండాలో ప్రధాన అంశాలుగా పొందుపరిచారు. అజెండాలోని అంశాలవారీగా సభ్యుల సమక్షంలో కలెక్టర్

-మిగతా 2లో

# అందుబాటులో లేని పశు వైద్యశాల డాక్టర్

## మృత్యువాత పడుతున్న మూగజీవాలు




**వ్యవసాయానికి గిట్టుబాటు కాని రైతులు.. దాని అనుబంధ రంగమైన పాడి పరిశ్రమను నమ్ముకొని పశు పోషకులు జీవిస్తున్నారు.** వివరాల్లోకెళ్తే..

**కావలి, మేజర్‌న్యూస్ :** కావలి రూరల్ మండల పరిధిలోని సర్వాయపాలెం గ్రామంలో ప్రభుత్వ పశు వైద్య శాల ఉంది. సర్వాయపాలెం, అనేమడుగు పంచాయతి.. ఈ రెండు పంచాయతీల పరిధిలోని అనేక గ్రామాల పశు పోషకులు వారి పశువులకు ఏ ఆపద కలిగినప్పటికీ ఈ పశు వైద్యశాలకు వచ్చి మూగ జీవాలకు చికిత్స తీసుకుంటారు. సర్వాయపాలెం పశువైద్యశాల వైద్యులు విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ.. విధులకు డుమ్మా కొడుతున్నారు. మొక్కుబడిగా విధులకు హాజరవుతారన్న ఆరోపణలు ఉన్నాయని రెండు గ్రామాల ప్రజలు చర్చించుకోవడం విశేషం. ఉదాహరణ శనివారం ఆసుపత్రి తలుపులు బార్లాగ తెరిచి ఉన్నాయి. అందులో వైద్యుడు కానీ, సిబ్బంది కానీ ఎవరూ లేరు. ఎంతో ఖరీదైన ప్రభుత్వానికి సంబంధించిన పరికరాలు, మూగజీవాలకు ఉపయోగించే మందులు సైతం వైద్యశాలలో ఉన్నాయి. వైద్యశాల ఆవరణం మొత్తం అస్తవ్యస్తంగా దర్శనమిస్తుంది. వాస్తవంగా ఆసుపత్రి ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు.. తిరిగి 2 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ప్రభుత్వ పని సమయం చేయాల్సి ఉంది. ఈ వైద్యశాలలో ఒక డాక్టర్, ఆఫీస్ సబర్డినేటర్, లైవ్ స్టాక్ అసిస్టెంట్, పని చేస్తుంటారు. పశు వైద్యుడు ఉదయం 10 గంటల సమయంలో వచ్చి ఓ గంట పాటు ఉండి వెళ్తారని పశు పోషకులు చెబుతున్నారు. ఆ గ్రామంలోనే ఉన్న మహిళా కాంపౌండర్ అన్నీ తానై వ్యవహరిస్తూ.. పశువులకు వైద్యం అందించాలన్నా, అనారోగ్యం వచ్చిన పశువులను, గొర్రెలను, ఆమె ఇంటికి తీసుకెళ్లాల్సిందేనని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. మరోపక్క ఆ గ్రామంలో సరైన వైద్యం పశువులకు అందకపోవడంతో నోటి దాకా వచ్చిన పంట ఏవిధంగా రైతులకు అందకుండా పోతుందో.. అదేవిధంగా పశు జీవాలపై ఆధారపడి ఉన్న రైతులు సకాలంలో మూగజీవాలకి వైద్యం అందక వారు జీవన ఉపాధిని కోల్పోవాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తపరిచారు. సమస్యతో వచ్చే రైతులకు మొక్కుబడిగా మందులు ఇస్తూ కాలం గడుపుతున్నారు. ఎలాగూ రైతులకు ఇక్కడ న్యాయం జరగకపోవడంతో కావలిలోని ప్రైవేటు మెడికల్ షాపుల్లో కొనుగోలు చేసి వేలకు వేలు నష్టపోతున్నామని వారు వాపోతున్నారు. నూతన ప్రభుత్వం ఏర్పడినప్పటికీ అధికారులు మరింత నిర్లక్ష్యం ఏర్పడిందా.. లేక ఉన్నతాధికారులు మమ్మల్ని ఏమి చేయగలరని ధీమానా ! మరి ఇక్కడ జరుగుతున్న అరాచకాలను ప్రశ్నించేవారు లేకనా.. ఏది ఏమైనప్పటికీ ఈ వైద్యశాలపై ఉన్నతాధికారులు సమగ్ర విచారణ జరిపించి చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రజలు, రైతులు, ప్రజా సంఘాలు కోరుతున్నాయి.

## మురుగునీటి పారుదలకు తగిన చర్యలు తీసుకోండి : కమిషనర్ సూర్యతేజ

**నెల్లూరు కార్పొరేషన్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు నగరపాలక సంస్థ పరిధిలోని అన్ని డివిజన్లలో డ్రైను కాలువల ద్వారా మురుగు నీటి పారుదల సాఫీగా జరిగేలా అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని ఇంజనీరింగ్ విభాగం అధికారులను కమిషనర్ సూర్యతేజ ఆదేశించారు. పారిశుద్ధ్య పనుల పర్యవేక్షణలో భాగంగా స్థానిక 5వ డివిజన్ సత్యనారాయణపురం, వైకుంఠపురం తదితర ప్రాంతాలలో కమిషనర్ శనివారం పర్యటించారు. డ్రైను కాలువలలో మురుగునీటి పారుదల సులభతరంగా ఉండేందుకు ఏర్పాటు చేసిన ఐరన్ మెష్‌లు నేలకు సమాంతరంగా ఉండునట్లు సరి చేయవలసిందిగా ఇంజనీరింగ్ అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. డ్రైను కాలువల్లో చెత్త వేసే వారిని గుర్తించేందుకు సిబ్బందిని నియమించి వారికి పెనాల్టీలు విధించే విధంగా చర్యలు తీసుకోవాల్సిందిగా కమిషనర్ పారిశుద్ధ సిబ్బంది వారికి ఆదేశాలు ఇచ్చారు. డ్రైను కాలువలో మురుగునీటి పారుదలకు ఇబ్బందిగా ఉన్న దగ్గర కల్వర్ట్ నిర్మించాలని స్థానిక ప్రజలు కమీషనర్‌ను కోరారు. వెంటనే ఇంజనీరింగ్ అధికారులను ప్రతిపాదనలు సిద్ధం చేయవలసిందిగా ఆదేశాలు జారీ చేశారు. అదేవిధంగా వైకుంఠపురం ఎస్టీ కాలనీ వద్ద మురుగు కాలువ నీరును అండర్ గ్రౌండ్ డ్రైనేజీకు అనుసంధానం చర్యలను వెంటనే చేపట్టవలసినదిగా సూచించారు. స్థానిక ప్రజలకు అవగాహన కల్పించి అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ కనెక్షన్లు చర్యలు చేపట్టవలసిందిగా ఇంజనీరింగ్ విభాగం వారికి ఆదేశాలు ఇచ్చారు. సత్యనారాయణపురం పార్కులో ఏర్పాటు చేసిన పిల్లల ఆట వస్తువులు, జిమ్ పరికరాలను పరిశీలించి, పార్కు మొత్తం మట్టిని నింపి, అలాగే ఆహ్లాదం కోసం పచ్చదనాన్ని పెంచాల్సిందిగా ఇంజనీరింగ్ ఈఈ రహంతూ జానీ, హార్టికల్చర్ అసిస్టెంట్ డైరెక్టర్ ప్రదీప్ కుమార్‌కు సూచించారు. కార్యక్రమంలో స్థానిక ప్రజా ప్రతినిధులు, నగరపాలక సంస్థ ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ చైతన్య, డిప్యూటీ కమిషనర్ చెన్నుడు, ఈఈ రహంతు జానీ, వెటర్నరీ డాక్టర్ మదన్ మోహన్, హార్టికల్చర్ అసిస్టెంట్ డైరెక్టర్ ప్రదీప్‌కుమార్, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రఘురాం, రెవెన్యూ ఆఫీసర్ ఇనాయతుల్లా, అసిస్టెంట్ సిటీ ప్లానర్ ప్రకాష్, సచివాలయ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

## రాష్ట్రంలో ప్రతినెలా 1న పింఛన్ల పండుగ

*(మొదటి పేజీ తరువాయి)*

ఆదేశాల మేరకు రాష్ట్ర వ్యాప్తంగా ప్రతి నెల ఒకటో తారీకు 68 లక్షలు మంది లబ్ధిదారులకు పింఛన్లు అందజేస్తున్నామన్నారు. ఒకటో తారీఖునే 99 శాతం పింఛన్లను పంపిణీ చేస్తున్నామన్నారు. ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం పింఛన్లు పెంచి వృద్ధులకు రూ.4 వేలు, వికలాంగులకు రూ.6 వేలు, మంచానికి పరిమితమైన వికలాంగులకు రూ.15 వేలు అందిస్తున్నామని,



అన్నా క్యాంటీన్లు ప్రారంభించి పేదల ఆకలి తీరుస్తున్నామని, దీపం పథకం ద్వారా మహిళలకు ఉచిత గ్యాస్ సిలిండర్లు అందిస్తున్నట్లు మంత్రి పునరుద్ఘాటించారు. తమ ప్రభుత్వం అసెంబ్లీలో ప్రవేశపెట్టిన బడ్జెట్లో ఎస్సీ, ఎస్టీ, బీసీలకు పెద్దపీట వేసింద న్నారు. ఈ ఏడాది నుంచే తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ పథకాల ను అమలు చేసేందుకు బడ్జెట్‌లో నిధులు కేటాయించినట్లు చెప్పారు. తల్లికి వందనం ద్వారా ఎంత మంది పిల్లలుంటే అంతమందికి ఒక్కొక్కరికి రూ.15వేలు, అన్నదాత సుఖీభవ పీఎం కిసాన్ పథకం కింద రైతులకు ఏటా రూ.20 వేలు ఆర్థికసాయం అందిస్తామని చెప్పారు. రాష్ట్రంలో ఖజానా ఖాళీగా ఉన్నప్పటికీ ముఖ్యమంత్రి అపార అనుభవంతో అభివృద్ధితో పాటు సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తూ.. ఎన్నికల హామీలను ఒక్కొక్కటీగా అమలు చేస్తున్నట్లు మంత్రి చెప్పారు.

రాష్ట్రంలో 123 మున్సిపాలిటీలకు ప్రజలు కట్టే పన్నుల ఆదాయాన్ని ఆయా మున్సిపాలిటీలే అభివృద్ధి పనుల కు వినియోగించుకునే స్వేచ్ఛను ముఖ్యమంత్రి కల్పించడంపై సీఎంకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఇది చాలా గొప్ప నిర్ణయంగా మంత్రి నారాయణ చెప్పారు. రానున్న మూడు సంవత్సరాల్లో ప్రతి ఇంటికి తాగు నీటి కొళాయి అందించాలని సంకల్పించామని, తమది ప్రజా ప్రభుత్వ మని, ప్రజల అవసరాలను గుర్తించి వారి బాగోగులు చూస్తున్నామని మంత్రి నారాయణ వివరించారు. మంత్రి వెంట జాయింట్ కలెక్టర్ కార్తీ క్, మున్సిపల్ కమిషనర్ సూర్యతేజ, డిప్యూటీ మేయర్‌లు రూప్‌కుమార్ యాదవ్, తహసీన్, స్థానిక కార్పొరేటర్ షేక్ సఫియా బేగం తదితరులు ఉన్నారు.


## నగరాలు, పట్టణాల అభివృద్ధికి కృషి చేయాలి

*(మొదటి పేజీ తరువాయి)*

సమీక్షించి ఆమోదించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. నెల్లూరు నగర అభివృద్ధితో పాటు నుడా పరిధిలోని ప్రాంతాల్లో మంచి లేఅవుట్లు వేసి ప్రజలకు తక్కువ ధరకు ఇంటిస్థలాలు అందించేందుకు చర్యలు చేపట్టాలన్నారు. ఒక ప్రత్యేక కార్యాచారణతో పని చేయాలని పిలుపునిచ్చారు. నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి మాట్లాడుతూ.. నెల్లూరు నగరంతో పాటు జిల్లాలోని పలు పట్టణాలు, పంచాయతీల్లో అన్ని అనుమతులతో ఎంఐజి లేఅవుట్లు, నుడా ఆధ్వర్యంలో లేఅవుట్లు వేసి తక్కువ ధరకు ఇంటి స్థలాలను ప్రజలకు అందించడమే లక్ష్యంగా పని చేస్తామని చెప్పారు. అనుమతులు లేని లేఅవుట్లలో ప్లాట్లు కొనవద్దని ప్రజలకు సూచించారు. ప్రభుత్వ భూములను ఆక్రమించి లేఅవుట్లు వేస్తు న్న నిర్వాహకులపై కఠిన చర్యలు తీసుకుంటామని, ఆ భూమిని నుడా స్వాధీనం చేసుకుంటుందని హెచ్చరించారు. మన నెల్లూరు ప్రత్యేకతను చాటేలా ఐ లవ్ యు నెల్లూరు సెల్ఫీ బోర్డులను కలెక్టరు కార్యాలయంతో పాటు ప్రభుత్వ కార్యాలయాలు వద్ద ఏర్పాటు చేయాలని విన్నవించారు. అలాగే నగరంలోని షాపింగ్ కాంప్లెక్స్‌లు, దుకాణాలు, పాఠశాలలు, కళాశాలల వద్ద ఐ లవ్ యు నెల్లూరు సెల్ఫీ పాయింట్లు ఏర్పాటు చేయాలని కోరారు. అలాగే జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో ఆ నియోజకవర్గాల పేరుతో సెల్ఫీ పాయింట్లను అందంగా ఏర్పాటు చేయాలని కోరారు. గతంలో నగరంలోని ఇనుగాలమ్మ గుడి సమీపంలో ఎన్‌టిఆర్ నెక్లెస్ రోడ్డు వద్ద తాను ఏర్పాటు చేసిన ఐలవ్‌యు నెల్లూరు సెల్ఫీ పాయింట్ చాలా అందంగా ఏర్పాటు చేసినట్లు గుర్తుచేశారు. అదే తరహాలో మంచి ప్రదేశంలో ఇప్పుడు ఏర్పాటు చేస్తామన్నారు. వైస్ చైర్మన్, నగరపాలక సంస్థ కమిషనర్ సూర్యతేజ మాట్లాడుతూ.. 11 మంది నుడా అథారిటీ సభ్యుల ఆధ్వర్యంలో నుడా అథారిటీ సమావేశం నిర్వహించి పలు నిర్ణయాలు తీసుకున్నట్లు చెప్పారు. కొత్త లేఅవుట్ల ఏర్పాటు, నుడా అభివృద్ధి కార్యక్రమాలు, నుడా బడ్జెట్‌కు కమిటీ ఆమోదం తెలిపినట్లు వైస్ చైర్మన్ చెప్పారు. నుడా ఆధ్వర్యంలో చేపట్టాల్సిన అభివృద్ధి కార్యక్రమాలను మరింత వేగవంతం చేస్తూ జిల్లా అభివృద్ధికి కృషి చేస్తామని ఆయన చెప్పారు. సమావేశంలో ఇరిగేషన్, ఆర్ అండ్ బి ఎస్‌ఈలు దేశ్‌నాయక్, గంగాధర్, పరిశ్రమల శాఖ జీఎం ప్రసాద్, ఆర్డీవో వంశీకృష్ణ, ముఖ్య ప్రణాళికాధికారి హిమబిందు, నుడా సెక్రటరీ పెంచలరెడ్డి, ప్రణాళికాధికారి హిమబిందు, అకౌంట్స్ ఆఫీసర్ హేమలత, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ ఈశ్వర్‌రాజు, డీటీ దానియేలు, నుడా కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## నూతనంగా గోయాజ్

## సిల్వర్ జ్యువెలరీ స్టోర్ ప్రారంభం



**నెల్లూరు కార్పొరేషన్, మేజర్‌న్యూస్ :** నెల్లూరులోని మినీ బైపాస్ రోడ్‌లో నూతనంగా గోయాజ్ లగ్జరీ సిల్వర్ జ్యువెలరీ స్టోర్‌ను ప్రముఖ సినీనటి అనుపమ పరమేశ్వరన్ శనివారం ఘనంగా ప్రారంభించారు. ఈ సంద ర్భంగా ఆమె మాట్లాడుతూ.. గోయాజ్ సిల్వర్ జ్యువెలరీ స్టోర్ ప్రారంభో త్సవానికి నెల్లూరు రావడం ఎంతో ఆనందంగా ఉందని, అంతేకాకుండా నెల్లూరు చేపల కూర అంటే తనకి చాలా ఇష్టమని తెలిపారు. అదేవిధంగా సిల్వర్ జ్యువెలరీలో ట్రెడిషనల్ జ్యువెలరీ అంటే ఇష్టపడతానని, మనిక్కె నా, నాణ్యత గల ఆభరణాల సంస్థ గోయాజ్ సిల్వర్ జ్యువెలరీ అని తెలి యజేశారు. అనంతరం నిర్వాహకులు రవితేజ వేములూరు, ప్రియాంక వేములూరు మాట్లాడుతూ.. అతి తక్కువ కాలంలోనే ప్రజల మన్ననలు పొంది, దక్షిణ భారతదేశ అంతట వేగవంతంగా విస్తరిస్తూ.. ఇప్పుడు 9వ స్టోర్‌ని మన నెల్లూరులో ప్రారంభించడం తమకెంతో సంతోషంగా ఉంద ని, తమ వద్ద అన్ని వెండి ఆభరణాలు 92.5 హాల్ మార్క్, 22కె గోల్డ్ ప్లేటెడ్ ఆర్నమెంట్స్ లభిస్తాయని, అదేవిధంగా 55 శాతం ప్రత్యేకమైన రిటన్ విలువతో రూ.50 వేల కంటే ఎక్కువ డిజైన్ల నుండి ఎంచుకోవచ్చని తెలియజేశారు. తమ గోయాజ్ స్టోర్ ప్రారంభం సందర్భంగా మార్చి 1 నుండి 9 వరకు అద్భుతమైన ఆఫర్లు నెల్లూరు ప్రజల కోసం తీసుకువ చ్చామని, రూ.లక్ష విలువైన వెండి ఆభరణాలను కొనుగోలు చేసిన వారికి 50 వేల విలువైన డైమండ్ నెక్లెస్, చెవిపోగులు, 50వేల విలువైన వెండి ఆభరణాలు కొన్నవారికి 25 వేల విలువైన టెంపుల్ ఆభరణాల గొలుసు ఉచితమని, 25 వేల విలువైన వెండి ఆభరణాలు కొన్న వారికి 12,500 విలువైన గుండు మల్లా నెక్లెస్ ఉచితమని వారు తెలియజేశారు. కస్టమర్ల సౌకర్యవంతంగా ఉండడానికి విదేశీ క్లైంట్ల కోసం ఫ్రీ పోర్న్ ఇండియా డెలివరీ ప్రయోజనం, గ్లోబల్ స్విప్పింగ్‌తో కష్టమర్లకు ఎక్కడి నుండి అయినా షాపింగ్ చేయడానికి అనుమతించే వీడియో కాలింగ్ సౌకర్యం తాము అందుబాటులో తీసుకు వస్తున్నట్లు ఈ సందర్భంగా వారు తెలియజేశారు.

# బడ్జెట్లో వెనుకబడిన ప్రాంతాలకు తీవ్ర అన్యాయం

**ఉదయగిరి, మేజర్‌న్యూస్ :** రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్లో వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి నిధుల కేటాయింపు విషయంలో తీవ్ర అన్యాయం చోటుచేసుకొందని రాష్ట్ర వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి వేదిక రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ మాదాల శ్యాంప్రసాద్ తీవ్రంగా ఖండించారు. శనివారం తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. దశాబ్దాల క్రితం ప్రారంభమైన ప్రాజెక్టులు పూర్తిగా అవసరమైన నిధులు కేటాయించకపోవడం వెనుకబడిన ప్రాంతాల పట్ల ప్రభుత్వ వైఖరి తెలుస్తోందన్నారు. నేటికీ వ్యవసాయం మీద ఆధారపడి జీవనం సాగిస్తున్న 60శాతం మంది ప్రజల ప్రయోజనాలకు ప్రభుత్వం తిలోదకాలిచ్చిందన్నారు. మెట్ట ప్రాంతాల్లో ఉన్న మేధావులు, ప్రజా, రైతు సంఘాలు ప్రభుత్వాన్ని అనేక సందర్భాల్లో డిమాండ్ చేసినా సాగునీటి ప్రాజెక్టులకు రాష్ట్ర బడ్జెట్లో సరైన కేటాయింపులు జరగలేదన్నారు. ఇప్పటికైనా ప్రభత్వం మేల్కొని వ్యవసాయరంగానికి, సాగునీటి ప్రాజెక్టులైన వెలుగొండ, సోమశిల హైలెవల్ కెనాల్కు కనీస నిధులు కేటాయించి బడ్జెట్లో అవసరమైన సరవణలు చేయాలన్నారు. అలా చేయకపోతే రాష్ట్ర వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి వేదిక పెద్దఎత్తున కలిసివచ్చే వారందర్ని



కలుపుకుని ఆందోళన కార్యక్రమాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జేవీవీ నాయకులు దస్తగిరి అహ్మద్, గాజులపల్లి రామి రెడ్డి, రైతు స్వరాజ్యవేదిక రాష్ట్ర కార్యదర్శి రమణయ్య, సామాజిక విశ్లేషకులు, మాలకొండయ్య రైతు పోరాటయోధ నాయకులు ఆదినారాయణ, చిరంజీవి, రాఘవ, శ్రీనివాసులరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఆపద అంటే క్షణాల్లో ఆదుకుంటా.. : మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి

## బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేత



**కావలి, మేజర్‌న్యూస్ :** కావలి పట్టణ మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్ కుమార్ రెడ్డి కావలి పట్టణంలోని వడ్డీ పాలెం కనకదుర్గమ్మ ఆలయం వద్ద 30, 32 వార్డులో షార్ట్ సర్క్యూట్తో గ్యాస్ సిలిండర్ పేలి అగ్ని ప్రమాదానికి గురి ఆ గృహం పూర్తిగా కాలిపోయింది ఆ కుటుంబం ఈ ప్రమాదం జరగడంతో కన్నీరు మున్నీరుగా విలపించారు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్ కుమార్ రెడ్డి ఆ కుటుంబానికి అండగా ఉంటానని అంతేకాకుండా కావలి నియోజకవర్గంలోని ఏ కుటుంబానికి ఆపద వచ్చిన నేను తోడుంటానని చెప్పి రామిరెడ్డి ప్రతాప్ కుమార్ రెడ్డి ఆ కుటుంబానికి ఆర్థిక సహాయంగా 25వేల రూపాయలు నగదును అందించారు. అంతేకాకుండా వైసీపీ జిల్లా అధ్యక్షులు కనుమర్లపూడి నారాయణ పట్టణ అధ్యక్షులు కేతిరెడ్డి శివకుమార్ రెడ్డి సహాయంగా పదివేల రూపాయలు శనివారం వారి గృహానికి వెళ్లి మాజీ ఎమ్మెల్యే ఆదేశాల ప్రకారం ఆర్థిక సహాయాన్ని అందించారు. కావలి పట్టణంలో రాజకీయ నాయకులు మాటలు చెప్పేవారే కానీ  ఎవరు సహాయం చేయరు. మాజీ ఎమ్మెల్యే చేసిన ఆర్థిక సహాయానికి 30, 32 వార్డు ప్రజలు వారికి కృతజ్ఞతలు తెలిపారు.

# ముస్తాబవుతున్న మసీదులు

## ▶ నేటి నుంచి ఉపవాస దీక్షలు ప్రారంభం



**పొదలకూరు, మేజర్‌న్యూస్ :** రంజాన్ ముస్లింల పవిత్ర మాసం. రంజాన్ శనివారం సాయంత్రం నెలవంక దర్శనంతో ప్రారంభమైందని, రంజాన్ ఇస్లామిక్ క్యాలెండర్లో 9వ నెల ఈ మాసంలో ముస్లింలు ఉపవాస దీక్షలు చేపట్టడం ఆనవాయితీగా జరుగుతుందని ముస్లిం మతపెద్ద మౌలానా ముస్తక్ మదని అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ మాసంలో పవిత్ర ఖురాన్ అవతరించింది. నేటి నుంచి నెల రోజుల పాటు ముస్లింలు దీక్షలు, ప్రత్యేక ప్రార్థనలు చేయనున్నారు. ఈ పండుగ క్రమశిక్షణ, దాతృత్వం, మతపరమైన ఆలోచనల కలయిక. తెల్లవారు జామున లేచి తిన్న తర్వాత రోజంతా ఉపవాసం ఉంటారు. మళ్లీ సూర్యాస్తమయంలోనే దీక్ష విరమిస్తారు. ఉదయం భోజనాన్ని సహర్ అని, సాయంత్రం భోజనాన్ని ఇఫ్తార్ అని అంటారు. ఇలా రోజుకు 13 గంటలపాటు అబద్ధాలు చెప్పకుండా, దూషించకుండా, అవమానించకుండా, కోపానికి గురికాకుండా కఠిన ఉపవాస దీక్షలు పాటిస్తారు. ప్రతి ముస్లిం ఉపవాస దీక్షలు పాటిస్తారు. ప్రతి ముస్లిం ఉపవాస దీక్షలు పాటిస్తారు. చెడు నుండి దూరంగా ఉండండి, మంచిని అనుసరించాలని ఆయన అన్నారు.

# నాటు సారా రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు నవోదయం 2.0 కార్యక్రమం



**బోగోలు, మేజర్‌న్యూస్ :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం నాటు సారా రహిత రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్‌ను తీర్చిదిద్దేందుకు ప్రవేశపెట్టిన నవోదయం 2.0 కార్యక్రమంలో భాగంగా డిప్యూటీ కమిషనర్ ఆఫ్ రోహిబిషన్ అండ్ ఎక్సైజ్ నెల్లూరు టి.శ్రీనివాసరావు, డిస్టిక్ రోహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి నెల్లూరు ఏ.శ్రీనివాసులు నాయుడు, ఎస్.శ్రీనివాసులు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఇన్స్పెక్టర్ కావలి వారి ఆధ్వర్యంలో బోగోలు మండలం కప్పరాల తిప్ప గ్రామంలో శనివారం క్రిస్టియన్ చర్చి  సభ్యులు అయిన ఆకుల డేవిడ్ పాల్, మేకల సాల్మన్ రాజు, సమక్షంలో చర్చి సెంటర్ వద్ద నవోదయం 2.0 కార్యక్రమంలో భాగంగా అవగాహన సదస్సు నిర్వహించి గ్రామస్తులతో నాటు సారా వంటి మత్తు పదార్థాలు తయారు చేయుట, రవాణా చేయుట ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ చట్ట ప్రకారం నేరమని వివరించారు. నాటు సారా సేవించుట, వాటి వలన కలిగే అనర్థాలపై ఆగాహన కల్పించారు. నాటు సారా తయారీ విక్రయాలు, ఇతర మత్తు పదార్థాల గురించి ఏదైనా సమాచారం అందితే వెంటనే ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ కావలి అధికారులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. ఈ సదస్సులో జె రమేష్ అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరిడెంట్ నెల్లూరు, ఎన్ఫోర్స్మెంట్ వింగ్ సిఐ వై వెంకటేశ్వర్లు, ఈఎస్‌టిఎఫ్ సీఐ శ్రీనివాసరావు కావలి, ఎస్ శ్రీనివాసులు సిఐ బుచ్చిరెడ్డిపాలెం, కె.పి కిషోర్ వారి సిబ్బంది తదితరులు ఈ కార్యక్రమం పాల్గొన్నారు.

# బడ్జెట్లో సంక్షేమానికి పెద్దపీట

## ● మండల తెలుగు యువత నాయకులు తోట మనోజ్



**సీతారామపురం, మేజర్‌న్యూస్ :** రాష్ట్ర బడ్జెట్లో ముఖ్యమంత్రి చంద్రబాబు సంక్షేమ పథకాలకు రాష్ట్ర అభివృద్ధికి ఎక్కువ నిధులు కేటాయించి పేద బడుగు వర్గాల ప్రజల అభివృద్ధికి పెద్ద పీట వేశారని తెలిపారు. తోట మనోజ్ శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ అన్ని వర్గాల ప్రజలకు, అన్ని ప్రాంతాల సంక్షేమానికి పెద్దపీట వేసేలా ఉందని, తెలిపారు. ముఖ్యంగా బలహీన వర్గాల సంక్షేమానికి 47వేల కోట్ల రూపాయల మంజూరు చేయడం బలహీన వర్గాల పట్ల చంద్రబాబు నాయుడు కున్న చిత్తశుద్ధికి నిదర్శనం అని తెలిపారు. అభివృద్ధికి ఆమడ దూరంలో ఉండే ఎస్సీ, ఎస్టీ సంక్షేమానికి 28వేల కోట్ల కేటాయించడం శుభ పరిణామమని తెలిపారు. అలాగే ఎన్నికల్లో వాగ్దానం చేసిన సూపర్ సిక్స్ పథకాలకు బడ్జెట్లో నిధులు కేటాయించడం మంచి పరిణామమన్నారు. రానున్న విద్యా సంవత్సరం నుంచి తల్లికి వందనం, మహిళలకు ఆర్టీసీ బస్సులలో ఉచిత ప్రయాణం అమలవుతాయని తెలిపారు. మెట్ట ప్రాంతమైన సీతారాంపురం మండల అభివృద్ధి కొరకు ఎమ్మెల్యే కాకర్ల సురేష్ ప్రణాళిక రూపొందించాలని ఈ బడ్జెట్లో ఎక్కువ నిధులు ఉదయగిరి ప్రాంతానికి తీసుకుని వచ్చి ఉదయగిరిని మరింత అభివృద్ధి చేస్తారని తెలిపారు.

## అదుపుతప్పిట్రాలీ ఆటో బోల్తా



**ఉదయగిరి, మేజర్‌న్యూస్ :** మండలంలోని గండిపాళెం ఆనందాశ్రం సమీపంలో ఓట్రాలీ ఆటో అదుపు తప్పి రోడ్డు ప్రక్కనే వున్న వ్యవసాయ కాలువలో బోల్తాపడిన సంఘటన శుక్రవారం అర్ధరాత్రి ప్రాంతంలో జరిగింది. వివరాలిలా వున్నాయి.. చిత్తుకాగితాలు సేకరించి ఆటోలో లోడ్చేసుకుని పామూరు. వైపునుండి ఉదయగిరి వైపు వెళ్తుండగా గండి పాళెం గ్రామసమీపంలోకి వచ్చేసరికి ఆటో అదుపు తప్పి కాలువలో పడి పోయింది. స్థానికులు గమనించి డ్రైవర్ను కాపాడారు. ఈప్రమా దంలో ఎవరికి గాయాలు కాలేదు. ప్రపదం తప్పడంతో డ్రైవర్ ఊపిరి పీల్చుకు న్నారు. ఆటోను శనివారం ఉదయం జేసీబీ సమాయంతో బయటకు తీశారు. ఈఘటనపై పోలీసులకు పిర్యాదు అందలేదు.

## బహిరంగ లీజు వేలం

**నెల్లూరు, మేజర్‌న్యూస్ :** నెల్లూరు రెడ్ క్రాస్ సొసైటీకి సంబంధించిన పినాకిని సత్యాగ్రహ గాంధీ ఆశ్రమంకు సంభందించిన 2 ఎకరాల 14 సెంట్ల భూమిలో గల మామిడి, ఇతర ఫలవృక్షముల ఫలసాయంను, అదేవిధంగా కొబ్బరి మొక్కలు వేసి ఉన్న 1 ఎకరా 37 సెంట్లు మొక్కలలో అంతర పంట సాగు చేసుకునేందుకు, మూడు సంవత్సరాల కాలంకు అనుభవించుటకు ఇందుకూరుపేట తహసిల్దార్ ఆధ్వర్యంలో ఈనెల 10వ తేదీన సోమవారం బహిరంగ లీజు వేలం నిర్వహిస్తున్నట్లు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ బహిరంగ లీజు వేలంలో పాల్గొనదలిచినవారు 5వేల రూపాయలను 09వ తేదీ ఉదయం 11-00 గంటల లోపు పల్లిపాడు పినాకిని సత్యాగ్రహ గాంధీ ఆశ్రమంలో చెల్లించి రసీదు పొందవలెను. ఈ భూములను వేలంలో పొందులేని వారికి ధరావతు సొమ్మును వెంటనే తిరిగి చెల్లించబడును. మరిన్ని వివరాల కొరకు 9640027128, 9647108108కు సంప్రదించవలెను.

## ఇంటర్ పరీక్షలు ప్రారంభం

**ఉదయగిరి, మేజర్‌న్యూస్ :** స్థానిక ఆల్తురి రామిరెడ్డి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. తొలిరోజు ప్రథమ సంవత్సరం విద్యార్థులు తెలుగు, సంస్కృతం, ఉర్దూ పరీక్షలు నిర్వహించారు. ఈ పరీక్షకు 370 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 343 మంది హాజరైనట్లు చీఫ్ సూపరిండెంటెంట్ వాసుబాబు, డిపార్టుమెంట్ అధికారి జమునలు పేర్కొన్నారు. పరీక్షా కేంద్రం వద్ద పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.

# ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవ వారోత్సవాలు

## మెడికల్ క్యాంప్ ప్రారంభించిన ఏఎస్పీ అడిషనల్ సౌజన్య



**నెల్లూరు క్రైం, మేజర్‌న్యూస్ :** రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు నేపథ్యంలో, మహిళా దినోత్సవం వారోత్సవాలలో భాగంగా ఎస్పీ జి.కృష్ణకాంత్ ఆదేశాల మేరకు ఉమేష్ చంద్ర కాన్ఫరెన్స్ నందు మెడికల్ క్యాంప్, ఓపెన్ హౌస్ కార్యక్రమాన్ని అడిషనల్ ఎస్పీ సౌజన్య ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సమాజ అభివృద్ధిలో మహిళల పాత్ర అత్యంత కీలకమన్నారు. విద్య, ఉద్యోగం, పారిశ్రామిక రంగాల్లో మహిళలు ముందుకు రావడం ద్వారా సమాజం మరింత పురోగమిస్తుందన్నారు. మహిళల సామాజిక, ఆర్థిక, రాజకీయ, సాంస్కృతిక ప్రాధాన్యతను, మహిళా సాధికారతకు సంబంధించిన కార్యక్రమాలు చేపట్టడం, లింగ సమానత్వాన్ని ప్రోత్సహించే ప్రచారాలను చేయడం మార్చి 1 నుండి మార్చి 8వ తేది వరకు సదస్సులు, చర్చలు, ప్రదర్శనలు నిర్వహిస్తామని తెలిపారు. మెడికల్ క్యాంప్‌ను ప్రారంభించి, మహిళ ఆరోగ్యంగా ఉంటేనే ఆ కుటుంబం ఆరోగ్యంగా ఉంటుందన్నారు. అత్యవసర హెల్ప్ లైన్ 112, చైల్డ్ హెల్ప్ లైన్ 1098ల గురించి వివరించారు. ఓపెన్ హౌస్ కార్యక్రమంలో విద్యార్థిని, విద్యార్థులకు, చిన్నారులతో సరదాగా ముచ్చటించి ఆయుధాలు, పరికరాల పని తీరు, పోలీసు శాఖకు సంబంధించిన పలు విషయాలపై అవగాహన కల్పించారు. పోలీసుశాఖ ఉపయోగించే ఆయుధాలు, మెటల్ డిటెక్టర్, డ్రాగన్ లైట్, రాకర్, కంట్రోల్ రూమ్, కమ్యూనికేషన్ విభాగం చేసే తీరుని విపులంగా వివరించారు. ఈ కార్యక్రమంలో నగర డిఎస్పీ సింధుప్రియ, పోలీసు అధికారులు, నారాయణ ఆసుపత్రి డాక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

# రోడ్డుకు విలువైపులా ఉన్న జంగిల్ తొలగింపు



**ఉదయగిరి, మేజర్‌న్యూస్ :** ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ ఆదేశాలతో ఉదయగిరి మండలం నాయకత్వం కదిలింది. మండల కన్వీనర్ సిహెచ్ బయన్న సారథ్యంలో ఉదయగిరి మండలంలోని అయ్యవారిపల్లి పంచాయతీ దేకురుపల్లి గ్రామం నుండి ప్రధాన రహదారి (ఆర్ అండ్ బి రోడ్) వరకు ఉన్న కర్ర తుమ్మ చెట్లు పిచ్చి మొక్కలను తొలగించి రవాణాకు సౌకర్యం కలిగించి గ్రామస్తులకే కాకుండా చుట్టుపక్కల గ్రామ ప్రజలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చేశారు. కర్ర తుమ్మ చెట్లు ఏపుగా పెరిగి, రోడ్డు కుషించుకుపోయింది. దీనికి తోడు రాత్రి వేళల్లో విష సర్పాలతో ప్రజలు భయభ్రాంతులకు గురై ప్రయాణాలు మానుకునేవారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే కాకర్ల సురేష్ మండల నాయకత్వానికి ఆదేశాలు ఇచ్చారు. ఆదేశాలు అందుకున్న మండల కన్వీనర్ బయన్న తమ సొంత నిధులు వెచ్చించి రోడ్డుకు ఇరువైపులా ఉన్న జంగల్‌ను తొలగించారు. రోడ్డుకు ఇరువైపులా ఉన్న చెట్లను తొలగించడంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. మండల నాయకత్వాన్ని ఎమ్మెల్యే కాకర్ల సురేష్ ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు గుండుబోయిన వెంకయ్య మాజీ సర్పంచ్ పి.వెంకటసుబ్బయ్య చాతల శివయ్య యూత్ నాయకులు చింతన బోయిన శివకృష్ణ గుండు బోయిన విష్ణు తదితరులు పాల్గొన్నారు.

## అనుమతుల ప్రకారమే భవన నిర్మాణాలు జరిగేలా

# చర్యలు చేపట్టండి : కమిషనర్ సూర్యతేజ



**నెల్లూరు కార్పొరేషన్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు నగరపాలక సంస్థ కమిషనర్ ఎం.సూర్య తేజ వారాంతపు సమీక్షలో భాగంగా టౌన్ ప్లానింగ్ సిబ్బందితో కమాండ్ కంట్రోల్ సెంటర్ విభాగంలో శనివారం సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. అనుమతులకు విరుద్ధంగా నగరంలో నిర్మించిన అన్ని భవనాలకు చార్జిషీట్లు దాఖలు చేయాలని ఆదేశించారు. ఇప్పటికే పలుమార్లు సంబంధిత కార్యదర్శులు, సిబ్బందిని హెచ్చరించడం జరిగిందని, ఇప్పటికీ చార్జిషీట్ దాఖలు పరచని వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటానని సిబ్బందిని కమిషనర్ హెచ్చరించారు. నగరంలో నెల్లూరు నగర పాలక సంస్థ పట్టణ ప్రణాళిక విభాగం వారి అనుమతుల ప్రకారమే భవనాల నిర్మాణం జరిగే విధంగా చర్యలు చేపట్టాలని, నిర్మాణాలను పిల్లర్ల స్టేజిలోని గుర్తించి అనుమతుల ప్రకారం నిర్మించనిచో వెంటనే నిర్మాణ పనులను నిలుపుదల చేయవలసినదిగా ఆదేశించారు. ఆక్యుపెన్సీ సర్టిఫికేట్ విడుదల కానిదే నగరపాల సంస్థకు చెందిన కుళాయి కనెక్షన్, డ్రైనేజీ కనెక్షన్లను మంజూరు చేయబడదని నగర ప్రజలకు అవగాహన కల్పించాలని ఆదేశించారు. సర్టిఫికెట్ లేకుండా నిర్మాణంలో ఏవైనా కార్యకలాపాలను నిర్వహిస్తున్నట్లు దృష్టికి వస్తే జరిమానాలు విధించాలని కమిషనర్ ఆదేశించారు. త్వరలో నక్ష సర్వే ద్వారా ప్రతి భవనము యొక్క స్వరూపము, ఉపయోగించు విధానం వివరాలు తెలుస్తుందని, సర్వే ద్వారా భవనాల ప్లాన్ అనుమతులు, కమర్షియల్ భవనాలకు ట్రేడ్ లైసెన్సుల మంజూరు వివరాలను ఖచ్చితంగా తెలుసుకోవచ్చని తెలిపారు. నిర్మాణంలో ఉన్న భవనానికి సంబంధించి పట్టణ ప్రణాళిక విభాగం వారు మంజూరు చేసిన అనుమతులను నిర్మాణ ప్రదేశంలో కనిపించే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అదేవిధంగా ట్రాఫిక్‌కు అడ్డంకిగా రోడ్లపై, వీధులలో ఉన్న నిరుపయోగమైన వాహనాలను ట్రాఫిక్ పోలీసు వారి సహాయంతో వెంటనే తొలగించి ప్రజలకు ఎటువంటి అసౌకర్యము లేకుండా తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో అదనపు కమిషనర్ వైఓ నందన్, సిటీ ప్లానర్ పద్మజ, అసిస్టెంట్ సిటీ ప్లానర్లు వేణు, ప్రకాష్, టౌన్ ప్లానింగ్, బిల్డింగ్ ఓవర్సీస్ ప్లానింగ్ కార్యదర్శులు పాల్గొన్నారు.



# ఇళ్ల క్రమబద్ధీకరణకు అవకాశం

**ఉదయగిరి, మేజర్‌న్యూస్ :** ప్రభుత్వ స్థలాల్లో నిర్మించుకున్న ఇళ్ల క్రమబద్ధీకరణకు ప్రభుత్వం అవకాశం కల్పించిందని తహసీల్దారు సుభద్ర శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. 2019 అక్టోబరు 16వ తేదీకి ముందు ప్రభుత్వ స్థలంలో ఇళ్లు నిర్మించుకుని ఉండి ఏలాంటి అభ్యంతరాలు లేకపోతే రిజిస్ట్రేషన్ చేయనున్నట్లు తెలిపారు. మండల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

# ఫించన్లు పంపిణీ చేసిన షేక్ సిరాజుద్దీన్



**చేజర్ల, మేజర్‌న్యూస్ :** మండల కేంద్రమైన చేజర్లలో సామాజిక ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పంపిణీ కార్యక్రమం శనివారం ఉదయం ఏడు గంటల నుంచి నిర్వహించారు.దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి ఆదేశాల మేరకు, కిమ్స్ హాస్పిటల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, ఆత్మకూరు నియోజకవర్గ సీనియర్ టిడిపి నాయకులు తాళ్లూరు గిరినాయుడు సూచనల మేరకు ఈ కార్యక్రమం చేపట్టారు. బీసీ సెల్ నాయకుడు రాంపాటి ప్రసాద్, మాదాల మహేష్ నాయుడు, రాంపాటి పుల్లయ్య,షేక్ లతీఫ్ అహ్మద్, శ్రీరామ్ బాబు సచివాలయ సిబ్బంది పెన్షన్ పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన విధంగా లబ్ధిదారులకు పెన్షన్ అందజేయడం జరిగిందని వారు తెలిపారు.

## పారిశుద్ధ్యంపై సిబ్బందికి శిక్షణా తరగతులు



**బోగోలు, మేజర్‌న్యూస్ :** బోగోలు లోకల్ ట్రైనింగ్ సెంటర్ (ఎల్టిసి) నందు గృహాల నుండి చెత్తను సేకరించుట, తడి చెత్త, పొడి చెత్త వేరుచేయుట, నాడెప్ తొట్లలో కంపోస్టు తయారీ, వర్మీ కంపోస్టు తయారీ, పశుపక్ష్యాదుల దహనవాటిక నిర్వహణతో పాటుగా గ్రీనరీ పెంచే విధానం గురించి శిక్షణ తరగతులు షేక్ నయూమ్ తాజ్ హసన్ ఈవో (పిఆర్‌ఎన్‌ఆర్‌డి) ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పరిశీలకులు డిపిఆర్‌సి ద్వారా హాజరైన డిఆర్ పి శ్రీనివాసులు రెడ్డి, బోగోలు పంచాయతీ కార్యదర్శి షేక్ అబ్దుల్ జహీర్, బోగోలు మండలం పంచాయతీ కార్యదర్శులు, గ్రీన్ అంబాసిడర్స్, గ్రీన్ గార్డ్స్, బోగోలు పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

## సిఐటియు ఆధ్వర్యంలో నిరసన ధర్నా



**నెల్లూరు కల్చరల్, మేజర్‌న్యూస్ :** ఆప్కాస్ రద్దు చేసి, ప్రైవేటు ఏజెన్సీలకు ఆప్కాస్ ఉద్యోగులను అప్పగించే నిర్ణయాన్ని తక్షణమే ఉపసంహరించుకోవాలని నెల్లూరు నగరపాలక సంస్థ వెహికల్ షెడ్ వద్ద శనివారం ఉదయం సిఐటియు ఆధ్వర్యంలో డ్రైవర్లు నిరసన ధర్నా చేపట్టారు. సమాన పనికి సమాన వేతనం ఇచ్చి పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. ఔట్సోర్సింగ్ విధానం పేరుతో ప్రభుత్వమే అధికారికంగా శ్రమదోపిడి చేస్తుందని, భారత రాజ్యాంగ చట్టం ప్రకారం పౌరులందరికీ సమానంగా అమలు చేయాలని, ఒకే రకమైన పని చేసే పర్మినెంట్ ఉద్యోగులకి ఒకరకంగా, ఔట్సోర్సింగ్ ఉద్యోగులకు ఒకరకంగా రూల్స్ పెట్టడం రాజ్యాంగ విరుద్ధం అని తెలిపారు. బడ్జెట్‌లో ప్రభుత్వ ఉద్యోగులు, సామాన్య ప్రజల ప్రయోజనాలకనుగుణంగా కేటాయింపులు లేవు అన్నారు. అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను పర్మినెంట్ చేసేంతవరకు పోరాటాన్ని ఉధృతంగా నిర్వహిస్తామని మున్సిపల్ వర్కర్స్ యూనియన్ గౌరవాధ్యక్షులు కత్తి శ్రీనివాసులు తెలిపారు.

కావలి ఏరియా వైద్యశాలకు సిబ్బంది కావలెను..

# పేరుకు మాత్రమే 100 పడకల వైద్యశాల

# సిబ్బంది కరువాయే

కావలి, మేజర్‌న్యూస్ : అన్నీ ఉండి అల్లుడు నోట్లో శని.. అన్న సామెతగా కావలి ఏరియా వైద్యశాల.. కావలి ఏరియా వైద్యశాల పేరుకు మాత్రమే 100 పడకల వైద్యశాలగా ఉంది కానీ అందులో కావలసినంత సిబ్బంది కరువయ్యాయి అనడంలో నిజం లేదు ఇక్కడ రేడియాలజిస్ట్‌గా సేవలందించాల్సిన సిబ్బంది ఈ వైద్యశాలకు నలుగురు సిబ్బంది ఉండవలసి ఉండగా ప్రస్తుతం ఒక రేడియాలజిస్ట్ మాత్రమే పని చేయుచున్నారు. అది కూడా సాయంకాలం నాలుగు దాటితే సిబ్బంది కరువవుతారు. కావలి చుట్టుపక్కల ప్రాంతాలలో ఎక్కడ యాక్సిడెంట్ జరిగిన ప్రమాదంలో గాయపడ్డ ట్రంకు రోడ్డుకి నేషనల్ హైవేకి అతి సమీపంలో ఉండేది ఈ ఏరియా వైద్యశాల మాత్రమే. ప్రతి నిత్యము సుమారు 400 నుండి 500 మంది వరకు పలు విధమైన వ్యాధులు చూపించుకొనుటకు వస్తుంటారు. అయితే ఇక్కడ సరైన ఎక్విప్మెంట్ ఉన్నప్పటికీ అక్కడ పనిచేయుచున్న అన్ని విభాగాల సిబ్బంది ఉండవలసిన సామర్థ్యంలో లేకపోవడం వల్ల వచ్చిన రోగులకు సకాలంలో వైద్యం అందించలేక పోతున్నారు. ప్రభుత్వ వైద్యశాల అంటేనే పేద రోగులకు నిరంతరం సేవలందించాల్సిన బాధ్యత ఈ వైద్యశాలలో వైద్యులకు ఉంది. అయితే రోగులకు అత్యవసర చికిత్స కొరకు వచ్చిన వారికి సకాలంలో ఇక్కడ వైద్యం అందడం లేదని చెప్పాలి, ఎందుకంటే ప్రస్తుతం ఉన్న సిబ్బంది చాలా తక్కువ తక్కువ సిబ్బందితోనే వచ్చిన రోగులకు నాణ్యమైన వైద్యం అందిస్తున్నారు. అలాగే 24 గంటలు రోగులకు సేవలు అందించాలి అంటే తగిన సిబ్బంది నియమించేందుకు ప్రభుత్వం వారు చొరవ తీసుకోవాలని ప్రజలు, ప్రజా సంఘాలు, ప్రతిపక్షాలు కోరుతున్నాయి. ప్రజలకు అతి ముఖ్యమైనది విద్య వైద్యం రాష్ట్రంలో విద్య




వైద్యం అనేది తప్పనిసరి అయింది. ప్రతి ఒక్కరు కూడా నిరంతరం ఈ ప్రభుత్వ ఏరియా వైద్యశాలకు ఎంతోమంది నిరుపేదలు వస్తుంటారని వారికి నిరంతరం అత్యవసర చికిత్సలు చేయాలంటే తగిన సిబ్బంది కావాలని కాబట్టి నూతనంగా ఏర్పడిన ఎన్డీఏ ప్రభుత్వం, రాజకీయ నాయకులు, ఉన్నత అధికారులు చొరవ తీసుకొని ఈ వైద్యశాలకు కావాల్సిన సిబ్బంది సమకూరిస్తే ఇంకా ఎక్కువ మందికి నాణ్యమైన వైద్య సేవలు అందించేందుకు కృషి చేస్తామని, వైద్యశాల సిబ్బంది కూడా తమ మనోభావన వ్యక్తపరిచారు. వచ్చిన రోగులకు సరైన వైద్యం అందించాలంటే, 24గంటలు వైద్య సేవలు అత్యవసర చికిత్సలు చేయాలంటే సిబ్బంది తప్పనిసరిగా కావాలని ప్రభుత్వం చొరవ తీసుకోవాలని కోరారు.

## రాష్ట్ర స్థితిగతిని మార్చే ప్రగతిశీల బడ్జెట్

డాక్టర్ మహేంద్ర యాదవ్



నెల్లూరు సిటీ, మేజర్‌న్యూస్ : వికసిత్ భారత్ స్ఫూర్తితో రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన 2025-26 బడ్జెట్‌తో రాష్ట్ర స్థితి గతిని మార్చే దిశగా అడుగులు వేస్తోందని బీజేపీ నేత డాక్టర్ ఒంటేరు మహేంద్ర యాదవ్ అభిప్రాయ పడ్డారు. స్వర్ణాంధ్ర విజన్ 2047లో భాగంగా పేద బడుగు బలహీన వర్గాలకు చేయూత నిచ్చే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్‌లో పాఠశాల విద్యా రంగానికి 31806 కోట్లు, బీసీ సంక్షేమ శాఖ రూ.23260 కోట్లు, వైద్య ఆరోగ్య శాఖ రూ.19265కోట్లు, పంచాయితీ గ్రామీణాభివృద్ధి శాఖ రూ.18848కోట్లు, జలవనరుల శాఖ రూ.1820 కోట్లు, వ్యవసాయ రంగం రూ.11636 కోట్లు ప్రజా రాజధాని అమరావతి నిర్మాణం కోసం రూ.6వేల కోట్లు, ఆంధ్రుల జీవనాడి పోలవరం ప్రాజెక్టు నిర్మాణం కోసం 6705కోట్లు కేటాయించి రాష్ట్ర పురోగాభివృద్ధి బాటలు వేశారని, ఈ బడ్జెట్ మీద యువత, మేధావులలో చర్చ జరగాలని కోరారు. బీజేపీ ప్రభుత్వం రాష్ట్ర ప్రభుత్వానికి ఎల్లవేళలా అండగా ఉంటూ ప్రజల ఆకాంక్షలు నెరవేర్చేందుకు కృషి చేస్తుందని తెలిపారు.

## ఇంటర్ పరీక్షా కేంద్రంలో సిట్టింగ్ స్క్వాడ్



మర్రిపాడు, మేజర్‌న్యూస్ : మండల కేంద్రమైన మర్రిపాడు ప్రభుత్వ జూనియర్ కళాశాల ఇంటర్మీడియట్ పరీక్ష కేంద్రంలో శనివారం పరీక్షలు ప్రారంభమయ్యాయి. ఈ తరుణంలో పరీక్షా కేంద్రానికి 248 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 11మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. మొదటి రోజున పరీక్షా కేంద్రం వద్ద పోలీసుల శాంతిభద్రతలతో 144 సెక్షన్‌ను అమలు చేయడం జరిగింది. పరీక్షా కేంద్రం చీఫ్ సూపరింటెంట్ విజయలక్ష్మి డిపార్ట్మెంటల్ ఆఫీసర్ శ్రీహరిలు కట్టుదిట్ట ఏర్పాట్లు చేసి ఇంటర్ పరీక్షలను నడిపించడం జరిగింది. నెల్లూరు నుంచి సిట్టింగ్ స్పాట్ కోటేశ్వరరావు పరీక్షా కేంద్రానికి చేరుకొని పర్యవేక్షించారు. ఉదయం పరీక్ష ప్రారంభం నుంచి పూర్తి అయ్యేవరకు ఆయన పరీక్షా విధానాన్ని పరిశీలిస్తూ ఉన్నారు. దీంతో మొదటి రోజున పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి.

## ఆక్వా రైతులపై అదనపు విద్యుత్ చార్జీలు భారాన్ని తగ్గించాలి



నెల్లూరు సిటీ, మేజర్‌న్యూస్ : ఆక్వా రైతులపై అదనపువిద్యుత్ చార్జీలు భారాన్ని తగ్గించాలని బీజేపీ నమామి గంగే రాష్ట్ర కన్వీనర్ మిడతల రమేష్ ముఖ్యమంత్రి చంద్రబాబు సర్కార్‌కు విజ్ఞప్తి చేశారు. ఆర్థిక ఇబ్బందులతో

చంద్రబాబు సర్కారుకు బీజేపీ నాయకులు వినతి

రొయ్యలు సాగు చేస్తున్న రైతులకు విద్యుత్ శాఖ భారీ అదనపు భారాన్ని మోపుతూ ఉంది. పంట సాగు చేసిన చేయకపోయినా ఫిక్స్ చార్జీల పేరుతో వేల రూపాయలల్లో బిల్లులు భారాన్ని మోపుతుంది. తాజాగా సర్ఛార్జిల పేరుతో లక్షల రూపాయలను విద్యుత్ బిల్లులో వేస్తున్నారు. మరోవైపు అదనపు సెక్యూరిటీ డిపాజిట్లు కట్టాలంటూ బిల్లులో లక్షల రూపాయలు విధిస్తున్నారు. ఆక్వా రంగంలో ఆక్వా జోన్‌బి నాన్ ఆక్వా జోన్‌లకు సంబంధం లేకుండా ఆక్వా రైతులకు ఒకే రకంగా సబ్సిడీ అందిస్తామని ఎన్నికల సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు హామీ ఇచ్చారు. ఆ హామీ ఇంకా అమలులోకి రాలేదు. రొయ్యల రైతులను విద్యుత్ శాఖ దోచుకుంటుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఆక్వా రైతులకు ఎన్నికల సందర్భంగా హామీ ఇచ్చిన విధంగా ఒకే స్లాబ్ కింద సబ్సిడీ వర్తించేలా నిర్ణయం తీసుకోవాలని బిజెపి నేత మిడతల రమేష్ జిల్లా కార్యవర్గ సభ్యులు నరాల సుబ్బారెడ్డి ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు.

## జనసేన ఆవిర్భావ దినోత్సవం

12వ వసంతంలోకి జనసేన..




నెల్లూరు సిటీ, మేజర్‌న్యూస్ : జనసేన పార్టీ ఆవిర్భవించి 12వ సంవత్సరాలు కావడంతో ఈనెల 14వ తేదీన పిఠాపురం నియోజకవర్గం చిత్రాడలో జరిగే పార్టీ ఆవిర్భావ దినోత్సవంకు నెల్లూరు జిల్లా నుంచి జనసేన సైనికులు వీరామహిళలతో పాటు అన్ని ప్రాంతాల నుంచి ప్రజలను ఆహ్వానించి పెద్ద ఎత్తున జన సమీకరణకు జనసేన పార్టీ దృష్టి సారించింది. నెల్లూరు నగరం, నెల్లూరు రూరల్, కోవూరు నియోజకవర్గాల నాయకులు కార్యకర్తల సమావేశం శనివారం నెల్లూరు గోమతి నగర్‌లోని జనసేన కార్యాలయంలో జరిగింది. ఈ సందర్భంగా జిల్లా నాయకుడు నూనే మల్లిఖార్జున యాదవ్ మాట్లాడుతూ.. రాష్ట్ర టీడ్కో చైర్మన్ వేముల పాటి అజయ్ కుమార్ సూచనలతో జిల్లా లోని అన్ని ప్రాంతాల నుంచి భారీగా వెళ్లి ఆవిర్భావ సభను జయప్రదం చేద్దామని కార్యకర్తలకు పిలుపు నిచ్చారు. ఈ సమావేశంలో నాయకులు కార్యకర్తలు

## పాఠశాల వార్షికోత్సవానికి హాజరైన మాలేపాటి భాను

కావలి, మేజర్‌న్యూస్ : కావలి నియోజకవర్గం దగదర్తి మండలంలో దుండిగం ఉన్నత పాఠశాల వార్షికోత్సవం సందర్భంగా పాఠశాల యాజమాన్యం ఆహ్వానం మేరకు దగదర్తి మండల తెలుగుదేశం పార్టీ యువనేత మాలేపాటి భాను ముఖ్యఅతిథిగా ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. మాలేపాటి భాను తన సొంత నిధులతో పాఠశాల ప్రాంగణాన్ని ఏర్పాటు చేసి చేసిన వేదికను ప్రారంభోత్సవం చేశారు. వార్షికోత్సవం సందర్భంగా భాను మాట్లాడుతూ.. నేటి విద్యార్థులే రేపటి పౌరులు విద్యలు రాణించిన వారు ఉన్నత శిఖరాలు అధిరోహిస్తారని వారు తెలిపారు. విద్య అనేది ప్రతి కుటుంబానికి ఒక వెలుగని, ధనము, ఆస్తి లేకపోయినప్పటికీ విద్య ఉంటే ఉన్నత శిఖరాలు అధిరోహించవచ్చని వారికి విద్యలో ఉండే విశిష్టతను వివరించారు. అనంతరం జరిగిన పలు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సాంస్కృతిక కార్యక్రమాల్లో విజయం సాధించిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. అనంతరం పాఠశాల యాజమాన్యం మాలేపాటి భానును



శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ ముఖ్య నాయకులు కంచర్ల కృష్ణ, వడ్డే భాస్కర్ నాయుడు, కాంద్ర కోటయ్య, కోనంకి శివయ్య, నేలపాటి బాలయ్య నాయుడు, మాలకొండయ్య, మధుసూదన్, తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు మాలయ పార్టీ అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# ఠంచన్‌గా పింఛన్ కూటమి ప్రభుత్వం : తుమ్మల

**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** నెలమొదటి రోజునే వృద్ధులు, వికలాంగులు, కళాకారులు, వితంతువులు, దీర్ఘకాలవ్యాధిగ్రస్థులు తదితరులందరికీ వారి ఇళ్ళవద్దకే సచివాలయ సిబ్బంది వెళ్ళి పెన్షన్లు పంపిణీ చేస్తుందని, తమ కూటమి ప్రభుత్వ చిత్తశుద్ధికి, పెన్షనర్లపట్ల ఉన్న అభిమానం, ఆదరణకు నిలువెత్తు సాక్ష్యమని ఆత్మకూరు పట్టణ తెలుగుదేశం అధ్యక్షుడు, మున్సిపాలిటీ మాజీ వైస్‌చైర్మెన్ తుమ్మల చంద్రారెడ్డి పేర్కొన్నారు. శనివారం ప్రాత కాలంనుండే ఆయన పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. సచివాలయ సిబ్బందితోపాటు ఆయన ఇంటింటికెళ్ళి పెన్షన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గతంలో 200రూపాయల పెన్షన్‌ను 2వేలరూపాయలకు పెంచారని, గత ప్రభుత్వం ఐదేళ్ళపాటు 250వంతున 3వేల రూపాయలకు పెంచగా చంద్రబాబు నాయుడు పదవిచేపట్టగానే నాలుగువేలకు పెంచడంతోపాటు మూడునెలల అరియర్స్‌ను కూడా కలిపి ఇళ్ళవద్దనే పంపిణీ చేయించారని పేర్కొన్నారు. నెల మొదటి రోజు సెలవుదినమైతే ముందురోజే పెన్షన్ పంపిణీ చేస్తున్నామని ఆయన తెలిపారు. అన్నివర్గాల సంక్షేమం, అన్నిప్రాంతాల అభివృద్ధితో పాటు అందరికీ ప్రతినెలా 1వతేదీ నాడే పెన్షన్‌లను పంపిణీ చేస్తున్నామన్నారు.



ముఖ్యమంత్రి నిర్ణయానుసారం, రాష్ట్ర దేవాదాయశాఖా మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ఆదేశాలతో తామంతా పెన్షనర్ల ఇళ్లవద్ద పెన్షన్ పంపిణీ కార్యక్రమంలో పాల్గొంటున్నామని చంద్రారెడ్డి పేర్కొన్నారు. కాగా మున్సిపల్ పరిధిలోని అన్ని ప్రాంతాల్లో ఆయా వార్డుల తెలుగుదేశం ప్రజాప్రతినిధులు, నాయకులు పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# నెట్‌బాల్‌పోటీల్లో జాతీయస్థాయి విజేతగా ప్రగతి విద్యార్థి మనోజస్వంత్






**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** ఆత్మకూరులోని ప్రగతి ఇంగ్లీష్‌మీడియం ఉన్నత పాఠశాల 9వతరగతి విద్యార్థి కందుకూరు మనోజస్వంత్ (కందుకూరు మల్లికార్జున కుమారుడు) నెట్‌బాల్ పోటీల్లో జాతీయస్థాయిలో విజేతగా నిలిచాడు. ఆత్మకూరు విద్యార్థి జిల్లా,రాష్ట్ర స్థాయిల్లో జరిగిన పోటీల్లో విజేతగా నిలిచి జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. హర్యానాలో జరిగిన జాతీయస్థాయి నెట్‌బాల్ పోటీల్లో జస్వంత్ అత్యంత ప్రతిభ చూపి ఆస్థాయిలో కూడా విజేతగా నిలిచి జిల్లా ఖ్యాతిని ఇనుమడింపజేశారు. జాతీయస్థాయి 37వ జూనియర్ నెట్‌బాల్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో తమ విద్యార్థి జశ్వంత్ అత్యంత ప్రతిభ చూపడంపట్ల అత్యంత సంతోషంగా ఉందని ప్రగతి స్కూల్ కరస్పాండెంట్ ఎస్.రామ్మోహన్‌రెడ్డి(అపుస్మా జిల్లా ఉపాధ్యక్షుడు), డైరెక్టర్ అమరావతి పేర్కొన్నారు. తమ పాఠశాలల్లో విద్యలోనూ, క్రీడల్లోనూ జస్వంత్ రానిస్తుంటాడని వారు తెలిపారు. తమ విద్యార్థి జాతీయస్థాయిలో క్రీడల్లో ప్రతిభ చూపడంతో వారు జస్వంత్‌ను అభినందించారు. పాఠశాల ఉపాధ్యాయ, బోధనేతర సిబ్బంది కూడా విద్యార్థిని అభినందించారు. భవిష్యత్తులో జస్వంత్ విద్యలోనూ, ఆటలు,క్రీడల్లోనూ మరింతగా రాణించాలని, జాతీయ, అంతర్జాతీయ పతకాలు సాధించాలని వారు ఆకాంక్షించారు.

# విద్యకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం

- సద్వినియోగం చేసుకోవాలి విద్యార్థిలోకం
- నిత్యాన్నదాత కంచి

**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** ప్రభుత్వం విద్యకు అత్యంత ప్రాదాన్యత ఇస్తుందని, విద్యార్థులకు అన్ని సౌకర్యాలు కల్పిస్తుందని, విద్యార్థులు వాటిని సద్వినియోగం చేసుకుని ఉత్తమ విద్య పొందాలని, అన్నీ సౌకర్యాలున్న ప్రభుత్వ పాఠశాలల్లో తమ బిడ్డలను చేర్పించేలా విద్యార్థుల తల్లిదండ్రులు శ్రద్ధ చూపాలని, ప్రవేటుపట్ల ఆకర్షణ తగ్గించుకోవాలని ఆత్మకూరులో నిత్యాన్నదాత, శ్రీ సాంబశివ చారిటబుల్‌ట్రస్ట్ చైర్మెన్ కంచి పరమేశ్వరరెడ్డి కోరారు. శుక్రవారం రాత్రి ఆత్మకూరు మండలం వెన్నవాడలోని మండలపరిషత్ ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు కలిశెట్టి రవీంద్రకుమార్ అధ్యక్షతన జరిగిన పాఠశాల వార్షికోత్సవ కార్యక్రమంలో కంచి పరమేశ్వరరెడ్డి, ఆత్మకూరు మండలాధ్యక్షుడు, జిల్లా మండలాధ్యక్షుల సంఘ అధ్యక్షుడు కేతా వేణుగోపాల్‌రెడ్డి తదితరులు అతిథులుగా పాల్గొన్నారు. తొలుత విద్యార్థుల ఇంగ్లీష్ సంభాషణలు, ఇంగ్లీష్ ఉపన్యాసాలు సాగించగా అందరినీ విశేషంగా ఆకట్టుకోగా విద్యార్థులను అత్యంత ప్రతిభావంతులుగా తీర్చిదిద్దుతున్న ప్రధానోపాధ్యాయుడు రవీంద్రకుమార్, సహోపాధ్యాయిని జీవనిలను వారు అభినందించారు. అకడమిక్‌పరంగా ప్రతిభ చూపిన విద్యార్థులకు, ఇతర సహకాంశాలపరంగా ప్రతిభ చూపిన విద్యార్థులకు అతిథులచేతులమీదుగా బహుమతీప్రధానం గావించారు. ఈసందర్భంగా కంచి పరమేశ్వరరెడ్డి ప్రసంగిస్తూ ప్రభుత్వ పాఠశాలల్లో అర్హులైన, అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులు, అవసరమైన మౌళికవసతులు, మధ్యాహ్న భోజనం, పాఠ్యపుస్తకాలు, ప్రభుత్వ పారితోషికాలు, ఉపకారవేతనాలు తదితరాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తూ వేలాదికోట్ల రూపాయలు వ్యయం చేస్తున్నారని, ఈ అవకావాలున్న ప్రభుత్వ పాఠశాలల్లో బిడ్డలను చేర్పించి విద్యాభ్యాసం గావించాలని, మంచి విద్యలభిస్తుందని ఆయన పేర్కొన్నారు. చాలామంది తల్లిదండ్రులు ప్రవేటు విద్యాసంస్థలపట్ల



మోజుచూపుతుండడం బాధాకరమని ఆయన అభిప్రాయపడ్డారు. పేదలకు మాత్రమే ప్రభుత్వ పాఠశాలలు అనే అపోహను తొలగించుకోవాలని ఆయన సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివిన వారు ఎందరెందరో ఉన్నత అధికారులుగా, ఉన్నత పదవులు పొందడంతోపాటు మంచి శాస్త్రవేత్తలుగా, రాణించారని, వారిని స్పూర్తిగా తీసుకోవాలని పరమేశ్వరరెడ్డి కోరారు. విద్యార్థుల పట్ల ఉపాధ్యాయులతోపాటు తల్లిదండ్రులు కూడా శ్రద్ధ చూపాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఆయన పేర్కొన్నారు. విద్య,వైద్యం సక్రమంగా పొందితే అందరూ సుఖసంతోషాలతో ఉంటారని, సమాజం బాగుంటుందని కంచి పేర్కొన్నారు. మండలాధ్యక్షుడు కేతా వేణుగోపాల్‌రెడ్డి ప్రసంగిస్తూ విద్యార్థులు శ్రద్ధాసక్తులతో చదివి నాన్యమైన విద్య పొందాలని, ప్రాథమిక దశలో గట్టిగా విద్యాపునాదులు నిర్మించుకుంటే భవిష్యత్తు ఉజ్వలంగా ఉంటుందని, నాణ్యమైన, సాంకేతికపరమైన విద్యా పొందితే సమాజంలో ఉపాధి, ఉద్యోగం, రాణింపు, గౌరవం, సామాజికసేవా అవకాశం తదితర ప్రయోజనాలున్నాయని ఆయన పేర్కొంటూ ఈపాఠశాల విద్యార్థులకు విద్య, ఆటలు, పాటలు, సాంస్కృతిక అంశాల్లో మెరుగ్గా తీర్చిదిద్దుతున్న ప్రధానోపాధ్యాయుడు రవీంద్రకుమార్, సహోపాధ్యాయిని జీవనిలను ఆయన అభినందించారు. ఈసందర్భంగా విద్యార్థులు అనేక సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించగా అందరినీ విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ఉపమండలాధ్యక్షురాలు కంభంశెట్టి ప్రమీల, జిల్లా అకడమిక్ మానిటరింగ్ అధికారి జి.సుధీర్‌బాబు, జిల్లా కమ్యునిటి మొబలైజేషన్ అధికారి కె.పెంచలయ్య, మండల విద్యాశాఖాధికారి కె.చలపతి, కరటంపాడు క్లస్టర్ ప్రధానోపాధ్యాయుడు ఇ.మాలకొండరావు, పేరారెడ్డిపల్లి ఉన్నతపాఠశాల ప్రధానోపాధ్యాయుడు, జిల్లా ప్రధానోపాధ్యాయుల సంఘ అధ్యక్షుడు సోమవరపు భాస్కరరెడ్డి, తెలుగుభారతి సేవాసమితి గౌరవసలహాదారు సోమవరపు యానాదిరెడ్డి, ప్రధానకార్యదర్శి అన్నపురెడ్డి పెదవెంకటరెడ్డి, రిటైర్డ్ హెడ్మాస్టర్ కె.వి.రమణయ్య, పలువురు ఉపాధ్యాయులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

# నాయీ బ్రాహ్మణుల జీవితాల్లో వెలుగులు

- ఈదర శ్రీనివాసులు



**నెల్లూరు, మేజర్‌న్యూస్ :** దశాబ్దాలుగా ఆదరణ కరువై చేయూత లేక బజారున పడ్డ నాయీ బ్రహ్మణులకు రాష్ట్ర ప్రభుత్వం అండగా నేనున్నానంటూ నిలు స్తోంది. వైసీపీ పాలనలో పూర్తిగా వివక్ష ఎదుర్కొన్న, నాయీ బ్రాహ్మణుల జీవితాల్లో కూటమి ప్రభుత్వం వెలుగులు నింపుతున్నదని తెలుగుదేశం పార్టీ నెల్లూరు జిల్లా కార్యదర్శి ఈదర శ్రీనివాసులు పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం సెలూన్లకు నెలకు 200యూనిట్లు ఉచితంగా కరంటు ఇస్తూ ఆర్థికంగా వెసులుబాటు కల్పిస్తున్నదని తెలిపారు. 2025 మార్చి బడ్జెట్‌లో ఉచిత కరంటు పథకానికి 450 కోట్లు బడ్జెట్ ఆధరణ పథకం ద్వారా కుల వృత్తులకు 1000కోట్లు నిధులు కేటాయించడం హర్షణీయమన్నారు. కులవృత్తి చేస్తూ షాపు నడుపుతున్నటువంటి వారికి 200యూనిట్లు ఇస్తామని హామీ ఇచ్చిన ప్రకారం బడ్జెట్లో 450కోట్లు రూపాయలు కేటాయించినందుకు రాష్ట్ర నాయి బ్రాహ్మణ సోదరులకు రాష్ట్ర నాయీ బ్రాహ్మణ సాధికార సమితి తరఫున కూటమి ప్రభుత్వానికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుకి డెప్యూటీ సీఎం కొణిదల పవన కళ్యాణ్‌కు తెలుగుదేశం పార్టీ విద్యాశాఖ మంత్రి లోకేష్ బాబుకి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. అలాగే కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరుస్తున్న సందర్భంగా ఇచ్చిన మాట ప్రకారం త్వరలో నాయి బ్రాహ్మణ కులానికి చట్ట సభల్లో అవకాశం కల్పిస్తారు అనడానికి ఎటువంటి సందేహం లేదని తెలిపారు. భవిష్యత్తులో కూడా నాయీ బ్రహ్మణలకు ఇచ్చిన హామీలను నెరవేర్చేది ఒక తెలుగుదేశం పార్టీ అని కొనియాడారు. ఇప్పటికే దేవాలయాల్లో బోర్డ్ సభ్యులుగా అవకాశాలు ఇవ్వడం ఈరోజు 200 యూనిట్లు ఉచిత విద్యుత్ ఇవ్వడం శుభ పరిణామమని శ్రీనివాసులు పేర్కొన్నారు.

# ఇళ్ళవద్దనే అవ్వాతాతలకు క్రమం తప్పకుండా ఫించన్



**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** రాష్ట్రంలో తమ కూటమి ప్రభుత్వం ప్రతినెలా 1వతేదీ నాడే, సెలవైతే ముందురోజే ఇళ్ళవద్దకే వెళ్ళి అవ్వాతాతలకు పెన్షన్‌లు అందజేస్తున్నామని ఆత్మకూరు మండల తెలుగుదేశం ప్రధానకార్యదర్శి కేతా విజయభాస్కరరెడ్డి పేర్కొన్నారు. శనివారం ఆత్మకూరు మండలం చెర్లోయడవల్లిలో విజయభాస్కరరెడ్డి సచివాలయ సిబ్బందితో కలిసి ఫించన్లు పంపిణీ చేశారు. ఇంటింటికెళ్ళి పెన్షనర్లకు పెన్షన్ మొత్తాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తమ ప్రభుత్వం క్రమం తప్పకుండా నెలమొదటిరోజే, ఆరోజు సెలవు అయితే ముందురోజే పెన్షన్‌లను అవ్వాతాతలకు అందిస్తుండడంతో వారి ముఖాల్లో చిరునవ్వు వెల్లివిరుస్తుందన్నారు. ముఖ్యమంత్రి అత్యంత పట్టుదలగా, ఎన్ని ఇబ్బందులున్నా ఖచ్చితంగా 1వతేదీనాడే ఇళ్ళవద్దనే పెన్షన్‌లు పంపిణీ చేయాలన్న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నిర్ణయంతో రాష్ట్ర దేవాదాయశాఖామంత్రి ఆనం రామనారాయణరెడ్డి పర్యవేక్షణలో పంపిణీ జరుగుతుందని విజయభాస్కరరెడ్డి పేర్కొన్నారు. ఇచ్చినమాట ప్రకారం పెన్షన్లను పెంచి క్రమం తప్పకుండా పంపిణీ చేస్తున్న ఘనత తమ ప్రభుత్వానిదేనని, ప్రజల ఆశలు, ఆశయాలకనుగుణంగా తమ కూటమి ప్రభుత్వ పాలన సాగుతుందని ఆయన పేర్కొన్నారు. ఆత్మకూరు నియోజకవర్గంలో మంత్రి ఆనం సారధ్యంలో సంక్షేమం, అభివృద్ధి సమాంతరంగా జరుగనుందని కేతా పేర్కొన్నారు.

# డాక్టర్ బాబు జగజ్జీవన్ రావు విగ్రహానికి నివాళి : ఎమ్మార్పీఎస్

**కావలి, మేజర్‌న్యూస్ :** మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు శనివారం అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా కావలి పట్టణంలోని ట్రంకు రోడ్డులో ఉన్న భారత మాజీ ఉప ప్రధాని డాక్టర్ బాబు జగజ్జీవన్ రావు విగ్రహానికి ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు చేవూరి కిరణ్ కుమార్ ఆధ్వర్యంలో ఘనంగా పూలమాలలు వేసి నివాళులర్పించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఎంఈఎఫ్ జాతీయ ఉపాధ్యక్షులు మంద వెంకటేశ్వర్లు మాదిగ పాల్గొని అమరవీరుల యొక్క ప్రాణ త్యాగాల ముందు మనం చేసే ఈ ఉద్యమము చాలా చిన్నదని మన కొరకు జైలు జీవితాలు గడిపి మన అభ్యున్నతకు కృషి చేసిన మందకృష్ణ మాదిగ 30సంవత్సరాలు అలుపెరగని పోరాటం ఫలితంగానే వారి ప్రాణత్యాగాలే మనం ఈ రోజున వారిని స్మరించుకుంటున్నట్లు తెలిపారు. అనంతరం అమరవీరుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. చేవూరు కిరణ్ మాట్లాడుతూ.. ఆంధ్రప్రదేశ్లో కూటమి ప్రభుత్వం త్వరలోనే వర్గీకరణ చేయాలని అసెంబ్లీ సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఎస్పి నియోజకవర్గ అధ్యక్షులు అక్కిలిగుంట ఏసు మాదిగ ఎంఎస్‌పి జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలు



గారా జానకి కావలి నియోజక వర్గ ఉపాధ్యక్షులు కత్తి శివయ్య ఎంఎల్‌ఎఫ్ రాష్ట్ర నాయకులు కొండయ్య ఎంఆర్పిఎస్ పట్టణ అధ్యక్షులు మంద మహేష్, మాదిగ పొట్లూరు శ్రీనివాసులు, చేవూరు విక్టర్ బాబు, మనోజ్, యోహాన్ రవి తదితరులు పాల్గొన్నారు.

# వైద్య సిబ్బంది తప్పక సమయపాలన పాటించాలి

## రాష్ట్ర ప్రజా ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ సంచాలకులు పద్మ వతి వెల్లడి



**నెల్లూరు, మేజర్‌న్యూస్ :** జిల్లా వైద్య ఆరోగ్యశాఖలో పనిచేస్తున్న ప్రతి ఉద్యోగి తప్పక సమయపాలన పాటించాలని రాష్ట్ర ప్రజా ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ సంచాలకులు డాక్టర్ పద్మావతి తెలిపారు. శనివారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో నిర్వహించిన సమీక్ష సమావేశాల ఆమె మాట్లాడుతూ.. జిల్లాలో పనిచేస్తున్న అధికారులు సిబ్బంది అందరూ ఆఫీసు సమయం, షిఫ్ట్ ప్రకారం తప్పనిసరిగా ముఖ ఆధారిత హాజరు వేయవలసిందిగా ఆదేశించారు. ముఖ ఆధారిత హాజరు వేయని వారికి సమయ పాలన పాటించని వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రతి అధికారి, ఉద్యోగి వారికి కేటాయించిన పనిచేసే చోటేనివాసము ఉండాలని ఆదేశించారు. ప్రతి ఫైల్ కూడా ఇ ఆఫీసు ప్రక్రియ ద్వారా చేపట్టేలా చర్యలు తీసుకోవాలని పరిపాలనాధికారిని ఆదేశించారు. ఓపి, ఐపి, ప్రభుత్వ ఆసుపత్రి ప్రసవాలు, ల్యాబ్ టెస్ట్‌లు, ఐయుసిడిలు ఆధారంగా పిహెచ్‌సిలకు గ్రేడింగ్ విధానం అమలు చేస్తున్నామని సి, డి గ్రేడ్ పిహెచ్‌సిలపై ప్రత్యేక దృష్టి సారించి గ్రేడింగ్ మెరుగు పడే లాగా చర్యలు తీసుకోవాల్సినదిగా ప్రోగ్రామ్ అధికారులను ఆదేశించారు. జిల్లాలో అంటువ్యాధులు ప్రబలకుండా అన్నీ ముందస్తు చర్యలు తీసుకోవలసినదిగా, నీటి నాణ్యతా పరీక్షలు నిర్వహించవలసినదిగా, ఎక్కడైనా అంటువ్యాధులు వ్యాప్తి చెందితే వెంటనే సంబందిత వైద్య ఆరోగ్య బృందము సదరు ప్రాంతాన్ని సందర్శించి అవసరమైన చోట వైద్య శిబిరాలు నిర్వహించి అన్నీ నివారణ చర్యలు తీసుకోవాల్సిందిగా, స్థానిక సంస్థ అధికారులతో సమన్వయం చేసుకోవాల్సిందిగా ఎపిడెమిక్ విభాగ అధికారులను ఆదేశించారు. రాబోవు వేసవి కాలమును దృష్టిలో ఉంచుకొని ఓఆర్ఎస్ డిపోలు ఏర్పాటు చేయవలసిందిగా ప్రజలకు వడదెబ్బకు గురి కాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్త లపై అవగాహన కల్పించవలసినదిగా ఆదేశించారు. అన్నీ ఆరోగ్య కేంద్రాలలో సరిపడినంత మందులను నిల్వ ఉంచుకోవలసినదిగా, ఎక్కడ కూడా మందులు కాలం చెల్లకుండా ముందుగానే చూసుకొని వాటిని అవసరమైన చోట వినియోగించేలాగా చూడవలసినదిగా ఆదేశించారు. ప్రతి ఆరోగ్య కేంద్రము నుండి బయో మెడికల్ వ్యర్థాలను వారానికి మూడు పర్యాయాలు తీసుకెళ్లెలాగా తగు చర్యలు తీసుకోవాల్సిందిగా ఆదేశించారు. అన్నీ జాతీయ, రాష్ట్రీయ ఆరోగ్య కార్యక్రమాల లక్ష్యాలను నూరు శాతం సాధించుటకు ప్రణాళికా బద్దంగా పని చేయవల్సినదిగా వైద్య ఆరోగ్యశాఖాధికారులను ఆదేశించారు. ఈ సమీక్షా సమావేశంలో డిఎం అండ్ హెచ్ ఓవివి సుజాత, ఎల్‌విటిఓ డాక్టర్ షేక్ ఖాదర్ వలి, డిఎల్‌వో డాక్టర్ ఏ. ఉమామహేశ్వరి, పిఓ డాక్టర్ పి.ఎల్. దయాకర్, ఏవో డాక్టర్ వై.వెంకటేశ్వర్లు, డిపిఎంఓ డాక్టర్ ఎం.రమేష్, డిఎస్ఓ డాక్టర్ ఎస్.భాస్కర్, యశ్వంత్, డెమో కె.కనక రత్నం, సర్వీస్ ఇంజినీర్ ఎస్.బాలాజీ, ఆఫీసు సూపరింటెండెంట్ విజయ కుమారి, రషీద్, వెంకటేశ్వర్లు, తదితర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# నాడీ వ్యవస్థ పై విద్యార్థులకు అవగాహన సదస్సు

**బోగోలు, మేజర్‌న్యూస్ :** బోగోలు మండలం కడనూతల రామిరెడ్డి సుబ్బరామిరెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో శనివారం నాడీ వ్యవస్థ పై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పీవీఎన్ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా నెల్లూరులోని ప్రముఖ హాస్పిటల్ అయిన అపోలో హాస్పిటల్‌లో ప్రముఖ న్యూరాలజిస్ట్‌గా, ప్రొఫెసర్‌గా పని చేస్తున్న డాక్టర్ బిందు మీనన్ విచ్చేసి నాడీ వ్యవస్థ పై అవగాహన కార్యక్రమాలను ఆర్ఎస్ఆర్ ఇంజనీరింగ్ విద్యార్థులకు, అధ్యాపక అధ్యాపకేతర సిబ్బందికి కలిగించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మెదడు, నాడీ వ్యవస్థకు సంబంధించిన సమస్యలను, నరాలకు సంబంధించిన సమస్యలకు కారణాలు, స్ట్రోక్, పార్క్ ఇన్ సన్ వంటి కేంద్ర నాడి వ్యవస్థ రుగ్మతల గురించి అందరికీ అవగాహన కల్పించారు. పై సమస్యలు రావడానికి ప్రధాన కారణాలుగా మద్యం సేవించడం, షుగరు, బిపి, విటమిన్ బి12 లోపం, నరాలకు సరిగా రక్తప్రసరణ జరగపోవడం ప్రధాన కారణం అని తెలిపారు. వీటి నివారణకు ప్రధానంగా క్రమం తప్పకుండా వ్యాయామం చేయడం, తగినంత విశ్రాంతి తీసుకోవడం, సమతుల్య



ఆహారం తీసుకోవడం, మొబైల్ ఫోను వీలైనంత తక్కువగా వాడడం వంటి జాగ్రత్తలు తీసుకున్నట్లయితే నాడీ వ్యవస్థ పై పెద్ద ప్రభావం ఉండదని, అందరూ ఆరోగ్యంగా ఉండవచ్చని తెలియజేశారు. కార్యక్రమంలో కళాశాల ఏవో ఆర్‌వి రమణారెడ్డి, అన్ని విభాగాల అధిపతులు, అధ్యాపకులు, అపోలో హాస్పిటల్ కావలి జోన్ పిఆర్‌ఓ మాధవ తదితరులు పాల్గొన్నారు.

## సదరమ్ సర్టిఫికేట్ల పరిశీలన వాయిదా

**ఉదయగిరి, మేజర్‌న్యూస్ :** జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాలమేరకు మండలస్థాయిలో జరుగుతున్న సదరమ్ సర్టిఫికేట్లు, దివ్యాంగుల పెన్షన్ల పరిశీలన కార్యక్రమం ఈనెల 3వ తేది నుండి 8వ తేది వరకు తాత్కాలికంగా వాయిదా వేయడం జరిగిందని ఎంపీడీఓ అప్పాజీ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆరోగ్య పెన్షన్లు, సదరం నవీకరణ, డిజిటల్లైన్ పూర్తిచేసున్న దృష్ట్యా వాయిదా వేయడం జరిగిందన్నారు. తిరిగి మార్చి రెండోవారంలో వెరిఫికేషన్ ప్రారంభమవుతుందన్నారు.

## జీవో నెంబర్ 30 ద్వారా గృహాలు క్రమబద్ధీకరణ



**మర్రిపాడు, మేజర్‌న్యూస్ :** మర్రిపాడు మండలంలోని ప్రభుత్వ, అనాధీనం భూములలో 150 నుంచి 300 చదరపు గజాలలో ఇల్లు నిర్మించుకున్న వారికి ప్రభుత్వం జీవో 30 ద్వారా భూములు క్రమబద్ధీకరణ చేస్తున్నట్లు మర్రిపాడు మండల ఇన్చార్జి తహసిల్దార్ అనిల్ కుమార్ యాదవ్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. తెల్ల రేషన్‌కార్డు కలిగిన వారికి భూమి విలువలో 15శాతం మినహాయింపు సౌకర్యం కల్పించి 50 శాతంతో రిజిస్ట్రేషన్ చేయించి పత్రాలు అందజేస్తామని తెలిపారు. 16వ తేదీ పదో నెల 2019కి ముందు ఇంటి వసతులు లేకుండా అనాధారికంగా ప్రభుత్వ భూములలో 150 నుంచి 300 గజాల తగాదాలు, ఆక్షేపణ లేకుండా ఇల్లు నిర్మించుకుంటే మీ దగ్గరలోని సచివాలయం, ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. పింకు రేషన్ కార్డు కలిగిన వారు ఆక్రమించుకొని ఇల్లు నిర్మించుకుంటే 301 నుంచి 400 చదరపు గజాల ఇల్లుకు భూమి విలువ 200శాతం చలానా రూపంలో డబ్బులు చెల్లించి 50శాతం రిజిస్ట్రేషన్ ఫీజుతో రిజిస్ట్రేషన చేయించి వారి పత్రాలను అందజేస్తామని తెలిపారు. ఈ అవకాశాన్ని బిపిఎల్ కేటగిరి ఏబీపీఎల్ కేటగిరి సద్వినియోగం చేసుకోవాలని ఆమె తెలిపారు. 31వ తేదీ 12వ నెల 2025 వరకు ఉంటుందని తెలిపారు. వివరాల కోసం రెవెన్యూ కార్యాలయంలో తహసిల్దార్ సంప్రదించాలని తెలిపారు.

## సయ్యద్ జమీనా భౌతికకాయనికి నివాళి



**కావలి, మేజర్‌న్యూస్ :** పట్టణంలోని వెంగళరావు నగర్ 22వ వార్డులో నివాసం ఉంటున్న తెలుగుదేశం పార్టీ నాయకులు సయ్యద్ మస్తాన్ వారి సతీమణి అనారోగ్య కారణంగా కాలం చెందారు. విషయం తెలుసుకున్న కావలి నియోజకవర్గం ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి వారి గృహానికి వెళ్లి పార్థివ దేహానికి ఘనంగా నివాళులర్పించారు. వారి పవిత్రమైన ఆత్మకు శాంతి చేకూరాలని, వారి కుటుంబానికి మరో ధైర్యాన్ని ఇవ్వాలని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు ఉన్నారు.

## ఆత్మకూరులో దోమల నివారణకు చర్యలు తీసుకోవాలి

**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** ఆత్మకూరు పట్టణం మున్సిపాలిటీ అన్న పేరేకానీ జనాల అవస్థలు గురించి అధికారులు, పాలకులు పట్టించుకోవడం లేదని పలువురు విమర్శిస్తున్నారు. మున్సిపల్ కేంద్రంగా ఉన్న ఆత్మకూరులో కోతులు, కుక్కలు, గోమాతల బెడద తీవ్రంగా ఉంటూ జనాలు ఆందోళనకు గురవుతూ తరచూ ఇబ్బందిపడుతున్నారు. ఇదిలా ఉండగా పట్టణంలో డ్రైనేజి వ్యవస్థ అస్థవ్యస్థంగా ఉండడం, పట్టణ మధ్యలో పంటకాలువలు కూడా ఉండడంతో దోమలు విపరీతంగా ఉన్నాయి. జనాలు మెష్‌లు, దోమతెరలు తదితర ఎంతగా నివారణ చర్యలు చేపడుతున్నా దోమలు తగ్గడం లేదు. ఏళ్ళతరబడి పట్టణంలో బ్లీచింగ్ చల్లడం కానీ, ఫాగింగ్ చేయించడం కానీ, మలాథియాన్ పిచికారి చేయించడం కానీ లేనేలేదు. మున్సిపాలిటీలో ఏళ్ళ తరబడి దోమల నివారణకు మున్సిపాలిటీ తరపున చర్యలు లేకపోవడం విడ్డూరంగా ఉందని పలువురు వ్యాఖ్యానిస్తుంటారు. మున్సిపాలకులు ఈ దోమల నివారణ గురించి ఏమాత్రం ఆలోచించి కౌన్సిల్ సమావేశాల్లో చర్చించిన దాఖలాలు లేవు. అధికారులు కూడా ఈవిషయమై నిర్లక్ష్యంగా ఉన్నారన్న విమర్శలు అధికంగా ఉన్నాయి. ఎవరైనా ప్రముఖులు పర్యటించే సందర్భంగా రోడ్లపై బ్లీచింగ్ దర్శనమిస్తుందే తప్ప పట్టణంలోని అన్ని ప్రాంతాల్లో బ్లీచింగ్ చల్లించే పరిస్థితి లేదు. గతంలో ఫాగింగ్ చేయించడం, బ్లీచింగ్ చల్లించడం, మలాథియాన్ పిచికారి చేయించడం జరుగుతుండేది. నాలుగేళ్ళుగా అలాంటి పరిస్థితి లేదని సర్వత్రా విమర్శిస్తున్నారు. పాలకులపై కూడా విమర్శలు తీవ్రంగానే ఉన్నాయి. మరి పాలకులు, అధికారులు స్పందిస్తారేమో చూడాల్సి ఉంది.

# అల్లిపురం డంపింగ్ యార్డ్‌లో చెత్త తొలగింపుకు శంకుస్థాపన

**నెల్లూరు కార్పొరేషన్, మేజర్‌న్యూస్ :** నగరంలోని 9వ డివిజన్ పరిధిలోని అల్లిపురం డంపింగ్ యార్డ్‌లో చెత్త తొలగింపు శంకుస్థాపన కార్యక్రమానికి రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణ, సర్వేపల్లి ఎమ్మెల్యే మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డితో కలిసి శనివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత వైసిపి ప్రభుత్వం చెత్తపై పన్ను విధించి చెత్త ప్రభుత్వంగా మిగిలిపోయిందని, ప్రజలపై చెత్త పన్ను విధించి 85 లక్షల మెట్రిక్ టన్నుల చెత్తను తమ ప్రభుత్వానికి అంటగట్టి పోయిందని ఎద్దేవా చేశారు. నేడు అల్లిపురం డంపింగ్ యార్డ్, దొంతాలి డంపింగ్ యార్డ్‌లో చెత్త తొలగింపునకు శంకుస్థాపన చేయడం జరిగిందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు రాష్ట్రంలో చెత్తను తొలగించే కార్యక్రమం చేపట్టామన్నారు. రానున్న ఆరు నెలల్లో డంపింగ్ యార్డ్‌లో పూర్తిస్థాయి చెత్త తొలగించి గ్రీనరీని ఏర్పాటు చేస్తామన్నారు. భారతదేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా గత వైసిపి ప్రభుత్వం 10లక్షల కోట్లు అప్పు చేసిందన్నారు. రాష్ట్రమున్సిపాలిటీల ఆదాయాలను దారి మళ్లించి ఆర్థిక వ్యవస్థను చిన్నాభిన్నం చేసిందని మండిపడ్డారు. వైసిపి ప్రభుత్వం చట్టాలను ఉల్లంఘించి ఇటువంటి దుశ్చర్యలకు పాల్పడిందన్నారు. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు ఏప్రిల్ ఒకటి నుంచి రాష్ట్రంలోని అన్ని మున్సిపాలిటీల్లో ప్రజలు వివిధ రూపాల్లో కట్టే పన్నులతో ఆయా మున్సిపాలిటీల అభివృద్ధికి కేటాయించడం అభినందనీయమని, ఈ సందర్భంగా ముఖ్యమంత్రిగా ధన్యవాదాలు తెలియజేశారు. గతంలో స్వచ్ఛభారత్ కింద 2500కోట్లు నిధులు రాష్ట్రానికి మంజూరైన మ్యాచింగ్ గ్రాండ్స్ కట్టకుండా వచ్చిన నిధులను వైసిపి ప్రభుత్వం తిరిగి పంపించేసిందన్నారు. రోడ్లను శుభ్రపరిచేందుకు 70 స్వీపింగ్ యంత్రాలను కొనుగోలు చేస్తున్నామని, త్వరలో యంత్రాలతో రోడ్లను శుభ్రపరిచే కార్యక్రమం చేపట్టనున్నామని మంత్రి తెలిపారు. నెల్లూరు నగరాన్ని అభివృద్ధి పరచాలంటే ఒక్క నారాయణ వల్లే సాధ్యమవుతుందని మాజీ మంత్రి సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి వ్యాఖ్యానించారు. తమ ప్రాంతంలో డంపింగ్ యార్డ్ ఉండడం మూలంగా ఎంతోమంది అనారోగ్యం పాలవుతున్నారన్నారు ఇదే విషయమై మంత్రి నారాయణ దృష్టికి తీసుకువెళ్లగా ఆయన వెంటనే స్పందించి డంపింగ్ యార్డ్ తొలగింపుకు చర్యలు చేపట్టారని సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులు రెడ్డి, డిప్యూటీ మేయర్ రూప్ కుమార్ యాదవ్, నెల్లూరు నగరపాలక సంస్థ కమిషనర్ సూర్య తేజ, మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ తాళ్లపాక అనురాధ, డివిజన్ ఇన్‌చార్జ్ కువ్వారపు బాలాజీ టిడిపి ముఖ్య నాయకులు, అధికారులు, స్థానికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



సూర్య

విలేకర్లు కావలెను
తెలుగు పత్రిక రంగంలో అందరి మన్ననలు పొంది పాఠకుల హృదయాలను దోచుకున్న నేటి దినపత్రిక సూర్య నందు విలేకర్లుగా పనిచేయుటకు ఉత్సాహవంతులైన యువతీ యువకులు కావలెను.
కావలసిన సెంటర్లు
నెల్లూరు జిల్లాలోని బుచ్చిరెడ్డిపాళెం, సంగం, కొడవలూరు, వెంకటాచలం,మనుబోలు, అల్లూరు, దగదర్తి, వింజమూరు దుత్తలూరు. నెల్లూరు పట్టణంలో దర్గామిట్ట, స్టోన్‌హౌస్‌పేట, వేదాయపాళెం, బాలాజీ నగర్‌లలో విలేకర్లు కావలెను.
మీ పూర్తి బయోడేటాతో వారంలోపు క్రింది చిరునామాలో సంప్రదించగలరు.
నేటి దినపత్రిక సూర్య కార్యాలయం
మిలటరీ కాలనీ, రోడ్ నెం.1,ఎల్ఐసి & సిఐడి ఆఫీసు ఎదురుగా, కొండాయపాలెం గేట్ సెంటర్, నెల్లూరు
9000118811, 9963827227

# మహమ్మద్ అఖిల్‌కు డాక్టరేట్ ప్రధానం



**నెల్లూరు, మేజర్‌న్యూస్ :** న్యాయ శాస్త్రంలో మహమ్మద్ అఖిల్ అహమ్మద్‌కు న్యూఢిల్లీలో శనివారం డాక్టరేట్‌ను ప్రధానం చేశారు. సామాజిక న్యాయం, మానవతా సేవల రంగంలో వారి అనుకూల కృషి, అహింసా సిద్ధాంతాల ప్రచారానికి గుర్తింపుగా ఈ ప్రతిష్ఠాత్మక సన్మానం లభించింది. ఈ సందర్భంగా ప్రముఖ వక్తలు, విద్యావేత్తలు, సామాజిక నాయకులు హాజరై డాక్టర్ అహ్మద్ సాధనలను ప్రశంసించారు. వారి ఉద్యమాలు సమాజంలో సమానత్వం, న్యాయబద్ధతను పెంపొందించడానికి దోహదపడుతున్నాయని, న్యాయ శాస్త్ర సిద్ధాంతాలను ఆధునిక సమాజ సవాళ్లతో అనుసంధానించిన ప్రయత్నాలు అభినందనీయమని ప్రత్యేకంగా పేర్కొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ అహ్మద్ మాట్లాడుతూ.. తనకు కొత్త బాధ్యతను ఇచ్చిందన్నారు. సమాజంలో న్యాయం, సమతుల్యత కోసం తన పోరాటాన్ని మరింత వేగవంతం చేస్తానని చెప్పారు. ఈ కార్యక్రమాన్ని నిర్వహించిన సంస్థ ప్రతినిధులు, భవిష్యత్ తరాలకు ప్రేరణాత్మక మార్గదర్శకంగా నిలుస్తుందని పేర్కొన్నారు. ఈ సన్మానం తన ప్రతిభ, సేవలకు ఒక మైలురాయిగా నిలిచిందన్నారు. న్యాయ శాస్త్ర రంగంలో భారతీయ సంప్రదాయాల ప్రాధాన్యతను ప్రపంచానికి తెలియజేస్తూ, ఈ కార్యక్రమం చరిత్రలో స్వర్ణాక్షరాలతో నమోదైందని అన్నారు.

# పోలీస్ స్టేషన్ తనిఖీ చేసిన ఆత్మకూరు డీఎస్పీ



**అనుమసముద్రంపేట, మేజర్‌న్యూస్ :** ఏఎస్పేటలోని పోలీస్ స్టేషన్‌ను ఆత్మకూరు డీఎస్పీ గోపాల్ శనివారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్‌లోని అన్ని రికార్డులను పరిశీలించారు అలాగే మండలంలోని క్రైమ్ వివరాలను అడిగి తెలుసుకున్నారు అలాగే గ్రామంలోని వివిధ కూడళ్ళలో ఏర్పాటుచేసిన సీసీ కెమెరాలు గురించి ఆరా తీశారు. ఏఎస్ పేటలో ఇప్పటివరకు ఎనిమిది సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడం జరిగిందని ఎస్ఐ ఏ. సైదులు వివరించారు. అలాగే స్టేషన్ లోని రిసెప్షన్ గదిని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పేట ఎస్ఐ ఏ. సైదులు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# రంజాన్ మాసం సందర్భంగా అవసరమైన చర్యలు చేపట్టండి : మంత్రి నారాయణ

**నెల్లూరు కార్పొరేషన్, మేజర్‌న్యూస్ :** రంజాన్ మాసం సందర్భంగా రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ నగరపాలక సంస్థ కార్యాలయంలో శనివారం అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యుత్, రెవెన్యూ, మున్సిపల్, పోలీస్ శాఖ అధికారులకు వాళ్లు సూచనలు చేశారు. ముఖ్యంగా రంజాన్ మాసం 30 రోజులపాటు ముస్లిం సోదరుల అవసరాలను గుర్తించి అందుకు అనుగుణంగా చర్యలు చేపట్టాలని, ప్రధానంగా పారిశుద్ధ్య నిర్వహణ, మున్సిపల్ త్రాగునీరు విడుదల చేయడం, వీధిలైట్లు ఏర్పాటు, పోలీస్ పికెటింగ్ తదితర సౌకర్యాలను తక్షణమే అందుబాటులోకి వచ్చే విధంగా చూడాలని అధికారులను ఆదేశించారు. అనంతరం మంత్రి మీడియాతో మాట్లాడుతూ.. రంజాన్ మాసంలో ముస్లిం సోదరులు ఎదుర్కొంటున్న పలు సమస్యలు తన దృష్టికి వచ్చాయన్నారు, ఉదయం 3 గంటల నుండే తాగునీరు అందుబాటులోకి వచ్చేలా చూడాలని మున్సిపల్ అధికారులను ఆదేశించామన్నారు, అలాగే ముస్లిం సోదరుల అవసరాల మేరకు వివిధ రకాల వస్తువులు కొనుగోలు చేసుకునేందుకు వీలుగా రాత్రి 12:00 వరకు షాపులు తెరిచి ఉంచాలని సూచించడం జరిగిందన్నారు. పోలీస్ అధికారులు అందుకు అనుగుణంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించడం జరిగిందన్నారు, మసీదుల వద్ద పారిశుద్ధ్య నిర్వహణ చెత్త బుట్టల ఏర్పాట్లను పర్యవేక్షించాలని తెలియజేయమన్నారు. అదేవిధంగా రాష్ట్రంలో ప్రవేశపెట్టిన బడ్జెట్లో ముఖ్యమంత్రి చంద్రబాబు అపార అనుభవంతో అన్ని రంగాల ప్రజలకు ఆమోదయోగ్యమైన బడ్జెట్ను ప్రవేశపెట్టడం జరిగిందని మంత్రి నారాయణ తెలిపారు. నిరుపేదల సంక్షేమం, నిరుద్యోగుల ఉపాధి రెండింటిని రెండు కళ్ళుగా కూటమి ప్రభుత్వం చూస్తుందన్నారు. ఇప్పటికే ఇచ్చిన హామీలను నెరవేర్చామని, ఎన్నికల ముందు చెప్పినట్టుగా ఎన్టీఆర్ భరోసా పెన్షన్లను పెంచామని అలాగే మహిళలకు ఇస్తామన్న సంవత్సరానికి మూడు సిలిండర్ల పథకాన్ని ప్రారంభించి మొదటి సిలిండర్ను అందించడం జరిగిందన్నారు.గత వైసిపి ప్రభుత్వం కేవలం మాటలకే పరిమితం అయిందని తాము చేతల్లో చూపిస్తామని మంత్రి చెప్పుకొచ్చారు. ఇకపై రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 123 మున్సిపాలిటీలలో ప్రజలు కట్టే వివిధ రకాల పన్నులను ఆయా మున్సిపాలిటీల అభివృద్ధికి కేటాయించాలని ముఖ్యమంత్రి ఆదేశించడం జరిగిందన్నారు. ఇటువంటి గొప్ప నిర్ణయం తీసుకున్న ముఖ్యమంత్రికి ఈ సందర్భంగా మంత్రి నారాయణ ధన్యవాదాలు తెలియజేశారు. గత ప్రభుత్వం ఆర్థిక ప్రణాళికలు లేక మున్సిపాలిటీలకు వచ్చే ఆదాయాన్ని సిఎఫ్ ఎంఎస్ ద్వారా దారి మళ్లించేదని ఇకపై మున్సిపాలిటీలకు వచ్చే ఆదాయం వారి ఖాతాలోనే ఉంటుందని మంత్రి వివరించారు. రాష్ట్రంలో ప్రతి ఒక్కరికి రోజుకు 135 లీటర్ల రక్షిత త్రాగునీరు అందించాలని ముఖ్యమంత్రి సంకల్పించారని అందుకోసం ప్రతి ఇంటికి త్రాగునీటి కొళాయిని ఏర్పాటు చేసే దిశగా అడుగులేస్తున్నారన్నారు. దీనికి కేంద్ర ప్రభుత్వం 8500 కోట్ల నిధులను ఇప్పటికే మంజూరు చేసిందని త్వరలో ఆయా పనులను ప్రారంభిస్తామని మంత్రి చెప్పారు. 2014-19లో తాను మంత్రిగా ఉన్న సమయంలో 1100 కోట్ల హాట్కోనిధులను తీసుకొచ్చి నెల్లూరు నగరంలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ త్రాగునీటి వ్యవస్థను ఏర్పాటు చేయడం జరిగిందని చివరి దశలో ప్రభుత్వ మారడంతో పనులు ఎక్కడివక్కడ ఆగిపోయాయని తెలిపారు. తిరిగి 165 కోట్ల నిధులను తీసుకొచ్చి మిగిలిపోయిన అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, సంఘం బ్యారేజి త్రాగునీరు పనులను ఈ నెలాఖరులోగా ప్రారంభించనున్నామని ఆయన పేర్కొన్నారు. అలాగే రాష్ట్రవ్యాప్తంగా ప్రతి ఒక్కరికి తాగునీరు అందించేందుకు మరో 500 కోట్ల రూపాయలను ముఖ్యమంత్రి



కేటాయించడం జరిగిందని, కేంద్రం నుండి 15వ ఆర్థిక సంఘం నిధులు, అమృత్ పథకం కింద 5350 కోట్లు మరో 8500 కోట్లు కలిపి 1350 కోట్ల నిధులను తీసుకొచ్చి రాష్ట్రంలోని అన్ని మున్సిపాలిటీలను అభివృద్ధి చేస్తామని, గత ప్రభుత్వం ఆర్థిక వ్యవస్థను చిన్న భిన్నం చేసిందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అపార అనుభవంతో ఒక్కొక్కటి చక్కదిద్దుతున్నారని మరో ఆరు నెలల్లో ఆర్థిక వ్యవస్థ గాడిలోకి తీసుకొస్తారని మంత్రి నారాయణ తెలిపారు. ఈ సమీక్షా సమావేశంలో జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్, జాయింట్ కలెక్టర్ కార్తీక్, నగరపాలక సంస్థ కమిషనర్ సూర్య తేజ, వాఫ్క్ బోర్డ్ చైర్మన్ అబ్దుల్ అజీజ్, డిప్యూటీ మేయర్లు రూప్ కుమార్ యాదవ్, తహసీన్, ఇతర మున్సిపల్, విద్యుత్ రెవెన్యూ పోలీస్ శాఖ అధికారులు, నగరంలోని పలు డివిజన్లకు చెందిన ముస్లిం నాయకులు పాల్గొన్నారు.

# వేసవి వచ్చేసింది అప్రమత్తంగా వుండండి

- ప్రతి పదిహేను రోజులకోసారి ఓవర్ హెడ్ వాటర్ ట్యాంకర్లను క్లీన్ చేయండి
- ఎక్కడ తాగునీటి సమస్య వచ్చినా 24 గంటలలో పరిష్కరించండి
- రంజాన్ మాసం సందర్భంగా మసీదుల వద్ద పారిశుధ్య చర్యలు చేపట్టండి
- విపిఆర్ ఫౌండేషన్ సౌజన్యంతో మసీదులకు క్యాన్స్ ద్వారా కూలింగ్ వాటర్ సరఫరా
- మండల అభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా అధికారులతో సమీక్ష : ఎమ్మెల్యే వేమిరెడ్డి





**నెల్లూరు, మేజర్‌న్యూస్ :** వేసవి సందర్భంగా కోవూరు నియోజకవర్గంలో తాగునీటి సమస్యలు రాకుండా అప్రమత్తంగా వుండాలని ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి అధికారులను ఆదేశించారు. నెల్లూరు నగరం మాగుంట లే అవుట్‌లోని ఆమె నివాసంలో కోవూరు నియోజకవర్గ పరిధిలోని ఎంపిడిఓలు, గ్రామీణ నీటి సరఫరా సంస్థ (ఆర్‌డబ్ల్యూఎస్) అధికారులతో ఆమె సమీక్షా సమావేశం నిర్వహించారు. ఎక్కడ తాగునీటి సమస్య ఉత్పన్నమైనా 24 గంటలలో సమస్య పరిష్కరించేలా అప్రమత్తంగా ఉండాలన్నారు. ఓవర్ హెడ్ ట్యాంకర్లకు వాటర్ లిఫ్ట్ చేసే మోటార్లు రిపేర్ అయిన పక్షంలో ప్రత్యామ్నాయంగా అదనపు మోటారు అందుబాటులో వుంచుకోవాలని సూచించారు. ఏ గ్రామంలో మోటార్ సమస్య వచ్చినా వెంటనే స్పేర్ మోటారు అక్కడకి చేర్చి తాగునీటి సరఫరాకు అంతరాయం లేకుండా చూడాలన్నారు. అవసరమైతే ప్రజలకు తాగునీటి ఇబ్బందులు రాకుండా 14, 15వ ఆర్థిక సంఘ నిధులతో పాటు జనరల్ ఫండ్స్ మరియు పంచాయతి ఫండ్స్ వినియోగించాలని కోరారు. సాధారణంగా వేసవిలో పవర్ కట్ ప్రాబ్లమ్స్ వస్తుంటాయి. వీలయితే విద్యుత్ శాఖా అధికారులతో సమన్వయం చేసుకొని ఓవర్ హెడ్ వాటర్ ట్యాంకర్లు ఫిల్ చేసేలా ప్రయత్నించాలన్నారు. మార్చి 2 నుంచి రంజాన్ మాసం సందర్భంగా ఉపవాస దీక్షలు మొదలవుతున్న నేపథ్యంలో మసీదుల వద్ద మెరుగైన పారిశుధ్య నిర్వహణ చర్యలు చేపట్టాలని అధికారులకు దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా నియోజకవర్గ పరిధిలోని మసీదులకు విపిఆర్ ఫౌండేషన్ సౌజన్యంతో క్యాన్స్ ద్వారా కూలింగ్ వాటర్ సరఫరా చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఓలు, గ్రామీణ నీటి సరఫరా సంస్థ (ఆర్‌డబ్ల్యూఎస్) అధికారులతో పాటు నియోజకవర్గ పరిధిలోని స్థానిక సంస్థల ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

# పేదల జీవితాల్లో సంతోషం నింపే బడ్జెట్

- 35 రూపాయలతో ప్రారంభమైన పెన్షన్ల పథకాన్ని ఏకంగా 4వేలకు పెంచిన ఘనత సీఎం చంద్రబాబుదే..
- గ్రామీణ ప్రజల జీవన ప్రమాణాలు మెరుగు పరచాలనే లక్ష్యంతో గ్రామీణాభివృద్ధి 18,848 కోట్లు
- 'ఎన్టీఆర్ భరోసా' పెన్షన్ల కోసమే 27వేల 518 కోట్ల రూపాయలు
- ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి





**నెల్లూరు, మేజర్‌న్యూస్ :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అభివృద్ధి దిశగా పరుగులు తీస్తుందన్నారు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి. ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణి చేసేందుకు విచ్చేసిన ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డికి కొడవలూరు మండలం రెడ్డిపాళెం గ్రామంలో ప్రజలు ఆత్మీయ స్వాగతం పలికారు. పుష్ప గుచ్ఛాలు శాలువాలతో సన్మానించి తమ అభిమానం చాటుకున్నారు. సచివాలయ సిబ్బంది, ఇతర ప్రభుత్వ ఉద్యోగులతో కలిసి వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి ఇంటింటికెళ్లి పెన్షన్లు అందచేశారు. ప్రజల యోగ క్షేమాలను విచారిస్తూ స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి గారు మాట్లాడుతూ గత ప్రభుత్వం విస్మరించిన గ్రామాభివృద్ధి టిడిపి అధికారంలోనికి వచ్చాక గాడిలో పడిందన్నారు. తాను ఎమ్మెల్యేగా ఎన్నిక అయ్యాక రెడ్డిపాళెం గ్రామంలో ఎన్నికల సందర్భంగా యిచ్చిన హామీ తాలూకు తాగునీటి సమస్యను పరిష్కరించిన విషయాన్ని గుర్తు చేశారు. రెడ్డిపాళెం నుంచి అటు చెర్లోపాళెం, వేగూరు, మోడేగుంట, ముదివర్తి గ్రామాలకు వెళ్ళే మార్గ మధ్యలో తెగిపోయి వున్న బ్రిడ్జ్‌ను సాధ్యమైనంత త్వరలో పునరుద్ధరిస్తామన్నారు. ఆధార్ కార్డులు లేని కారణంగా ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుకోలేక పోతున్న గిరిజనుల కోసం స్పెషల్ ఆధార్ డ్రైవ్ నిర్వహిస్తామన్నారు. ఎస్టీలకు నివాస స్థలాలతో పాటు పక్కా ఇళ్ళు నిర్మించి ఇచ్చేందుకు కృషి చేస్తానన్నారు. 35 రూపాయలతో ప్రారంభమైన పెన్షన్ల పథకాన్ని ఏకంగా 4 వేలకు పెంచిన ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గారిదేనన్నారు. గత ప్రభుత్వ అనాలోచిత నిర్ణయాల కారణంగా రాష్ట ఆర్థిక పరిస్థితి సంక్షోభంలో వున్నా.. సంక్షేమ పథకాల అమలులో ఎటువంటి ఆటంకం జరగలేదన్నారు. రానున్న మే నెలలో తల్లికి వందనం పథకంలో భాగంగా చదువుకుంటున్న ప్రతి బిడ్డకు సంబంధించి తల్లుల ఖాతాలో 15 వేలు జమ అవుతాయన్నారు. ఐదేళ్లకు సరిపడా సంక్షేమం మరియు అభివృద్ధికి పునాదులు వేసుకుంటూ.. ఎన్నికల సందర్భంగా చేసిన ప్రతి హామీ అమలు చేసే దిశగా కృషి చేస్తున్నారని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గారిని కొనియాడారు. పేదరిక నిర్మూలనే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పని చేస్తుందని అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందేలా కృషి చేస్తానన్నారు. పేదరిక నిర్మూలనే లక్ష్యంగా ప్రతిరోజూ, ప్రతిగంటా, ప్రతిక్షణం ప్రజల సంక్షేమం కోసం ఆలోచించే ముఖ్యమంత్రి ఈ దేశంలో ఎవరైనా వున్నారంటే అది ఒక్క చంద్రబాబు నాయుడు గారేనన్నారు ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి. ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ సుబ్బారావు, టిడిపి నాయకులు వెంకట రమణారెడ్డి, బెజవాడ వంశీకృష్ణా రెడ్డి, వినీల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## పులి వాహనం పై పార్వతీపరమేశ్వరులు



**నెల్లూరు కల్చరల్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు నగరం మూలాపేటలోని శ్రీ భువనేశ్వరి సమేత శ్రీ మూలస్థానేశ్వర స్వామి వారి దేవస్థానంలో బ్రహ్మోత్సవాల్లో భాగంగా శని వారం ఉదయం చప్పర ఉత్సవం, రాత్రి పులి వాహనంపై స్వామి అమ్మవార్లు దర్శన మిచ్చారు. ఈ వేడుకలు చూడడానికి భక్తులు విశేషంగా తరలివచ్చారు. భక్తులకు దేవస్థానం వారు తీర్థ ప్రసాదములు అందించారు. మహిళలు కోలాట నృత్యాల తో అలరించారు. ఈ వేడుకలు దేవస్థాన కార్యనిర్వహణాధికారి, సిబ్బంది ఆద్వర్యంలో ఘనంగా నిర్వహించారు.

## బిర్యానీ షాపుని ప్రారంభించిన ఎమ్మెల్యే కావ్య



**కావలి, మేజర్‌న్యూస్ :** కావలి పట్టణంలో విద్యాసంస్థలు వ్యాపారాలు రోజురోజుకి పెరుగుతున్న దృష్ట్యా, అలాగే విద్యార్థులు జనాభా సంఖ్యకు అనుకూలంగా వ్యాపార సంస్థలు నిర్వహిస్తున్నారు. అదేవిధంగా కావలి పట్టణంలోని రైల్వే రోడ్డు ప్రాంతము నందు బిర్యాని షాపును శనివారం కావలి ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి ఈ కార్యక్రమానికి హాజరై రిబ్బన్ కత్తిరించి ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ.. వ్యాపార అభివృద్ధి దినదినం పెరగాలని, ప్రజలకు నాణ్యమైన రుచికరమైన ఆహార పదార్థాలను అందించాలని వారు యాజమాన్యానికి తెలిపారు. కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు షాపు వ్యవస్థాపకులు పాల్గొన్నారు.

## అన్నా క్యాంటీన్ పరిశీలన : టీడీపీ నాయకులు




**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** ఆత్మకూరు పట్టణంలో ఉన్న అన్న క్యాంటీన్‌ను పట్టణ తెలుగుదేశం అధ్యక్షుడు తుమ్మల చంద్రారెడ్డి పరిశీలించారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు. చంద్రారెడ్డి మాట్లాడుతూ.. అన్న క్యాంటీన్లో పరిశుభ్రంగా, అన్న క్యాంటీన్‌కు వచ్చిన వారిపట్ల గౌరవంగా నడుచుకోవాలని ఆయన సూచించారు. భోజనం నాణ్యంగా ఉండేలా తయారు చేయాలన్నారు. పేదవారికి 5రూపాయలకే అన్నం పెట్టేలా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నిర్ణయించగా రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామ నారాయణ రెడ్డి ఆధ్వర్యంలో ప్రారంభించామన్నారు. పేదల ఆకలి తీరుస్తున్నామని చంద్రా రెడ్డి పేర్కొన్నారు.

## ఎస్‌బీఐ భీమా పథకాన్ని సద్వినియోగం చేసుకువాలి

**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా నూతనంగా ప్రవేశపెట్టబడిన ప్రమాద బీమా పథకాన్ని (జనరల్ ఇన్సూరెన్స్) తమ బ్యాంక్ ఖాతాదారులు ఉపయోగించుకోవాలని ఆత్మకూరు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మేనేజర్ మహమ్మద్ మున్వర్ కోరారు. గతంలో ఉన్న ప్రమాద బీమా పథకాన్ని రెట్టింపు చేస్తూ నూతన విధి విధానాలతో ఈ పథకాన్ని ప్రవేశపెట్టినట్లు ఆయన తెలిపారు. ఈ ప్రమాద బీమా పథకం ద్వారా స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఖాతాదారులు ఏడాదికి 2వేల రూపాయలు ప్రీమియం చెల్లించిన యెడల ఏడాదిపాటు ఈ పాలసీ అమలులో ఉంటుందని, ఈ పాలసీ పొందినవారు పాలసీ పొందిన నాటి నుండి ఏడాది కాలం పాటు ఏదైనా ప్రమాదవశాత్తు మరణం సంభవించిన లేదా పూర్తిస్థాయి అంగవైకల్యం ఏర్పడిన యడల పాలసీదారుని కుటుంబానికి 40 లక్షల రూపాయలు నగదును చెల్లిస్తారని తెలిపారు. గతంలో ఉన్న ఈ పాలసీ విధివిధానాలలో మార్పు చేసి రెండు వేల రూపాయలు చెల్లించి పాలసీ పొందితే ప్రమాదవశాత్తు మరణాలలో 40లక్షల రూపాయలు అందించే విధంగా రూపొందించినట్టు తెలిపారు. వీటితోపాటు పాలసీ పొందిన వారు ఏదైనా ప్రమాదం జరిగిన సమయంలో అంబులెన్స్ లేదా ప్రైవేటు వాహనాన్ని ఉపయోగించిన వాటి ఖర్చులు, పాలసీదారుడు మరణించిన సమయంలో వారి కర్మకాండ ఖర్చులకు చెల్లిస్తారని తెలిపారు. తమ బ్యాంకు ఖాతాదారులు ఈ ప్రమాద బీమా పాలసీని తీసుకొని ఏవైనా అనుకోని ప్రమాదాల సమయంలో వారి కుటుంబ రక్షణగా ఉపయోగించుకోవాల్సిందిగా తెలిపారు. తమ పాలసీ దారులు ప్రమాదవశాత్తు మరణించిన సమయంలో వారి కుటుంబానికి అండగా ఉండాలని ఈ పథకాన్ని రూపొందించినట్లు ఆయన తెలిపారు. ఈ పాలసీ పొందేందుకు బ్యాంకు సిబ్బందిని గాని లేదా తనను గాని సంప్రదించవచ్చు అని మహమ్మద్ మున్వర్ తెలిపారు.